
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
3
శనివారం 20 జనవరి 2024


నరసరావుపేట : లింగంగుంట్ల లేఅవుట్‌లో ప్రారంభం కాని ఇళ్ళ నిర్మాణాలు



నాలుగేళ్లుగా.. నత్తనడకన

అసంపూర్తిగా జగనన్న కాలనీలు

- ఇళ్ల లక్ష్యాలు ఘనం.. పురోగతి శూన్యం
- ఎండమావిగానే మౌలిక వసతుల కల్పన
- ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా పనులు
- పేదల ఇంటికి చిల్లిగవ్వ విదిల్చని రాష్ట్ర ప్రభుత్వం
- సమస్యలు పట్టించుకోని అధికారులు.. లబ్ధిదారుల అవస్థలు

రోడ్లు లేవు.. డ్రెయిన్లు లేవు.. తాగునీరు, కరెంటు లేదు.. అయినా కనాకష్టంగా ఇల్లు కట్టుకుంటే రవాణా, ఇతర సౌకర్యాలు లేవు. ఇదీ జిల్లాలోని జగనన్న కాలనీల దుస్థితి. పేరుగొప్ప, ఊరుదిబ్బ అను చందంగా జగనన్నకాలనీలు ఉన్నాయి. ఆర్భాటంగా స్థలాలిచ్చి అధికారులకు లక్ష్యాలు పెట్టి లబ్ధిదారులపై ఒత్తిళ్లు తెచ్చినా కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. పండుగలు వస్తున్నాయి.. పోతున్నాయే కానీ గృహ ప్రవేశాలు ప్రభుత్వం అనుకున్నట్లుగా కావడంలేదు. ఇల్లు కట్టుకోకుంటే స్థలం పోతుం దని.. లేదంటే మరొకరికి ఇచ్చేస్తామని లబ్ధిదారులను బెదిరించి మరీ ఇళ్లను నిర్మించుకునేలా అధికారులు చేసినా పెద్దగా నిర్మాణాలు సాగలేదు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు.. ఇల్లు కట్టుకున్న తర్వాత నివాసం ఉండేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించటంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో అత్యధిక కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు అరకొరగానే జరిగాయి. ఎన్నికలు సమీ పిస్తున్న నేపథ్యం లో వీలైనన్ని ఎక్కువ ఇళ్లు ఈ నెలాఖరు కల్లా పూర్తి చేయించి ఫిబ్ర వరిలో సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించినా ఆ పరిస్థితి ఎక్కడా కానరావడంలేదు.

పండుగలు పోతున్నాయి..

జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలకు ముహూర్తాలు మారిపోతున్నాయే కానీ పేదల కల నెరవేరడంలేదు. ఉగాది, దసరా, దీపావళి ఇలా ప్రతి పండక్కి జగనన్న కాలనీల నిర్మాణం విషయంలో ఘనంగా లక్ష్యాలు పెట్టుకోవడం ఆ తర్వాత వాటిని విస్మరించడం ప్రభుత్వానికి రివాజుగా మారింది. ఆరు నెలల క్రితం వరకు జగనన్న ఇళ్ల నిర్మాణం పురోగతి మీద వారాంతపు సమీక్షలతో ప్రభుత్వం హడావిడి చేసేది. ఒక దశలో యంత్రాంగానికి సైతం లక్ష్యాలు విధించి ఒత్తిడికి గురిచేసేది. అలాంటిది ప్రస్తుతం కాలనీల నిర్మాణం పురోగతిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.


యడ్లపాడు-కారుచోల మార్గంలో నిర్మాణాలు జరగని లే అవుట్, కంపచెట్లు పెరిగి అధ్వానంగా ఉన్న చిత్రం


సత్తెనపల్లి : ధూళిపాళ్ల లే అవుట్‌లో అసంపూర్తిగా నిర్మాణాలు


దాచేపల్లి మండలం నడికూడి జగనన్న కాలనీలో అసంపూర్తిగా జగనన్న ఇల్లు

లబ్ధిదారుల లబోదిబో

వైసీపీ ప్రభుత్వం ఎంతో ఘనంగా చెప్పుకుంటోన్న జగనన్న కాలనీల లేఅవుట్‌లు ఒక్క వర్షానికే నీటి తటాకాలుగా మారిపోతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో లేఅవుట్లు ఉండటంతో వర్షపు నీరు పోయే మార్గం లేదు. ఎప్పటికైనా భూమిలోకి ఇంకిపోవాల్సిందే తప్ప బయటకు పోయే పరిస్థితి లేదు. లే అవుట్లలో అంతర్గత రోడ్లు, కాలువలు, విద్యుత్, బోర్ల సౌకర్యాల పేరుతో రూ.కోట్లు వెచ్చించినట్లుగా అధికార వర్గాలు చెబుతున్నా.. ఆ పరిస్థితి ఎక్కడా లేదు. ఓ మోస్తరు వర్షానికి లేఅవుట్ల లో లోపాలు బహిర్గతమౌతున్నాయి. వందల లారీలు మట్టిపోసి స్థలాన్ని ఎత్తు పెంచుకుని ఇళ్లు నిర్మించుకున్నా వర్షపు నీరు చుట్టుముట్టేస్తుందని బాధితులు వాపోతున్నారు.


మాచర్ల పట్టణంలో ముళ్ల కంపలతో మూసుకుపోయిన జగనన్న కాలనీకి వెళ్లే రహదారి


యడ్లపాడు జగనన్న కాలనీలో నిలిచిపోయిన ఇంటి నిర్మాణం

(ఆంధ్రజ్యోతి - పల్నాడు బృందం)

కాలనీలు కాదు.. ఊళ్లను నిర్మిస్తున్నామని ప్రభుత్వం జగనన్న కాలనీల ప్రారంభోత్సవంలో ప్రకటించింది. పదుల ఎకరాల్లో లేఅవుట్లు వేసి వందల మందికి స్థలాలు ఇచ్చింది. అయితే నాలుగేళ్లు అవుతున్నా కాలనీలు ఊళ్లుగా మారలేదు కాని చిట్టడవులు, బురదగుంతలను తలపించేలా మారాయి. 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేసిన హడావుడి ప్రకటనలకే పరిమితమైందని జగనన్నకాలనీల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. పేదలందరికీ స్థలాలు ఇచ్చి, వారికి ఇళ్లు నిర్మించి ఇస్తానని ముఖ్యమంత్రి చెప్పిన మాట ఆచరణలో నీటి మూటగానే మిగిలిపోయింది. ఇళ్లు నిర్మించి ఇచ్చే విషయంలో ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేసి మెలిక పెట్టడంతో లబ్ధిదారులు నిర్మాణాలపై వెనుకంజ వేశారు. పేదల ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం చిల్లి గవ్వ కూడా విదల్చలేదు.

అరకొర వసతులు.. అప్పులు పాలు

పీఎంఏవై కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.లక్షా 80 వేలను తానిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటోంది. లబ్ధిదారుల పేరుతో డ్వాక్రా రుణం రూ.35 వేలు తీసుకుంది. ఈ మొత్తం రూ.2.15 లక్షలతో ఇల్లు కట్టుకోలేక లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఫలితంగా జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షల సాయం చేస్తానని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు ఇది పూర్తిగా అందిన దాఖలాలు లేవు. పైగా మొదట వారు ఖర్చు పెడితే తిరిగి చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు అమలుకు నోచుకోలేదు. కొందరైతే వచ్చిన స్థలం పోతుందేమోనని తమ వద్ద ఉన్నదంతా ఖర్చు చేసి, అప్పులు తెచ్చి నానా అగచాట్లు పడి నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ నిర్వాకం, అధికారుల ఒత్తిడి కారణంగా పేదలకు సొంతింటి కల నెరవేరకపోగా, అప్పులపాలై ఆర్థికంగా చితికి పోతున్నారు. అష్టకష్టాలు పడి ఇళ్లు నిర్మించుకున్న వారు కాలనీల్లో మౌలిక వసతుల లేక అల్లాడిపోతున్నారు. కాల్వలు నిర్మించకపోవడంతో చిన్న పాటి వర్షాలకే కాలనీలు తటాకాలను తలపిస్తున్నాయి. అధ్వాన పారిశుధ్యంతో దోమలు, దుర్వాసనలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నా అధికారులకు పట్టడంలేదు. కాలనీల్లో మౌలిక వసతులు లేకపోవడంతో లబ్ధిదారుల ఇక్కట్లకు అంతేలేదు. తాగునీటి సౌకర్యం లేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవటంతో చిత్తడిగా మారిన రోడ్లపై వెళ్ళలేక పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. రాత్రి వేళల్లో పాములు, విషపురుగుల సంచారం ఎక్కువగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల నుంచి రవాణా సౌకర్యం కూడా సరిగా లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. దీంతో ఇళ్లల్లో చేరిన వారు సైతం వాటిని ఖాళీ చేసి వెళ్లిపోతున్న దుస్థితి నెలకొంది.


బిల్లులు రాక పిల్లర్లు లేపి వదిలేసిన ఇళ్లు


పునాదులకే పరిమితమైన జగనన్న ఇల్లు

పల్నాడులో.. 24.91 శాతమే

పల్నాడు జిల్లా వ్యాప్తంగా 224 జగనన్న కాలనీల లేఅవుట్‌ను ఏర్పాటు చేశారు. 39,908 గృహాలు మంజూరు కాగా ఇప్పటికి 9,944 గృహాల నిర్మాణం పూర్తైనట్లు గృహ నిర్మాణ శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. మంజూరైన గృహాల లో 24.91 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తయింది. 13,075 గృహాలు ఫౌండేషన్ దిగువ స్థాయిలోనే ఉన్నాయి. ఫౌండేషన్ స్థాయిలో 11,971 గృహాలు, శ్లాబ్ స్థాయిలో 1,871, శ్లాబ్ పూర్తయిన స్థాయిలో 2,427 గృహాలు ఉన్నాయి. ప్రభుత్వం భావిస్తున్నట్లుగా ఎన్నికల నాటికి జిల్లాలో 29,964 గృహాల నిర్మాణం పూర్తి చేయడం అసాధ్యమనే చెప్పాలి. ఇక పలు కాలనీల్లో పూర్తయిన ఇళ్లల్లో లబ్ధిదారులు నివాసం ఉండలేని పరిస్థితులున్నాయి. మౌలిక వసతుల కల్పన జరగకపోవడం, ఊరికి దూరంగా కాలనీలు ఉండటంతో రవాణా సౌకర్యం లేకపోవడం తదతర సమస్యలతో లబ్ధిదారులు కాలనీలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడంలేదు. అష్టకష్టాలు పడి ఇళ్లు నిర్మించుకున్న వారు కూడా కాలనీల్లో కనీస సౌకర్యాలు లేక ఇళ్లల్లో ఉండలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లకు కనీసం విద్యుత్ కనెక్షన్లు కూడా లేవని లబ్ధిదారులు వాపోతున్నారు. సత్తెనపల్లి మండలం భీమవరం, గండ్లూరు, ధూళిపాళ్ల ప్రాంతాల్లో 2,907 ఇళ్లకు 499 మందే ఇళ్లు కట్టుకున్నారు. రోడ్లు, నీరు, విద్యుత్ సౌకర్యాలు లేకపోవడంతో నిర్మాణాలపై లబ్ధిదారులు వెనుకంజ వేస్తున్నారు. కాలనీల్లో నిర్మా ణాలు జరగక పోవడంతో పిచ్చి చెట్లు కూడా మొలు స్తు న్నాయి. యడ్లపాడు 3 లేఅవుట్‌లో 100 మందికి ప్లాట్లు కేటాయించగా ఐదుగురు మాత్రమే బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేసి వదిలివేశారు. గురజాల నియోజకవర్గ పరిధిలో 5681 ఇళ్లు మంజూరు కాగా వెయ్యి గృహాలు బేస్‌మట్టం లెవల్ దాటలేదు.

నియోజకవర్గం	మంజూరు	పూర్తి
నరసరావుపేట	5,957	1,200
చిలకలూరిపేట	3,547	872
వినుకొండ	5,575	1,191
మాచర్ల	4,555	479
గురజాల	5,354	1,805
సత్తెనపల్లి	4,830	1,800
పెదకూరపాడు	9,490	2,597

పాల వెల్లువ కేంద్రంలో వ్యాపారం

- పాల సేకరణ నై.. ఎరువుల అమ్మకాలకు సై
- ప్రభుత్వ భవనంలో సర్పంచ్ వ్యాపారంపై విమర్శలు

గురజాలటౌన్, జనవరి 19: అది జగనన్న పాల వెల్లువ కేంద్రం.. అయితే అక్కడ జరుగుతుంది మాత్రం ఎరువుల వ్యాపారం. జగనన్న పాల వెల్లువ అని పెద్దపెద్ద అక్షరాలతో భవనం ఉంది. కానీ లోపలికెళ్తే మాత్రం అక్కడ ఎరువుల బస్తాల అమ్మకాలు జరుగుతున్నాయి. పాల సేకరణ అధికంగా ఉన్న గ్రామాల్లో ప్రభుత్వం జగనన్న పాల వెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘం పేరిట భవనాలు నిర్మించింది. అయితే నిజానికి అక్కడ ఎటువంటి పాల సేకరణ జరగకపోగా వైసీపీ నేతలు తమ వ్యాపారాలకు ఆ భవనాలను వినియోగించుకుంటున్నారు. ఇందుకు సజీవ సాక్ష్యంగా మండలంలోని గోగులపాడులో పరిస్థితి ఉంది. గ్రామంలో రూ.15.74 లక్షలతో జగనన్న పాల వెల్లువ భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని గతేడాది మార్చి 10న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రారంభించారు. అయితే అక్కడ ఎటువంటి పాల సేకరణ జరగడం లేదు. ప్రధాన రహదారి, సచివాలయం పక్కనే ఈ భవనం ఉంది. దీంతో సర్పంచ్ ఈ భవనాన్ని తన వ్యాపారానికి వినియోగించుకుంటున్నారు. సర్పంచ్.. పైగా అధికార పార్టీ నేత కావడంతో అక్రమంగా ప్రభుత్వ భవనాన్ని వినియోగించుకోవడంపై అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి కృషి చేయాల్సిన ఆయన ప్రభుత్వ భవనాన్ని సొంతానికి వినియోగిస్తుండడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో ఫణికుమార్‌ను వివరణ కోరగా.. తన దృష్టికి రాలేదని, విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


పాల వెల్లువ భవనం లోపల ఎరువుల బస్తాలు

పోలింగ్ బూత్‌ల వద్ద వసతులు కల్పించాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట రూరల్, జనవరి 19: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద ర్యాంపులు వంటి మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ శివశంకర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ నుంచి కలెక్టర్ శుక్రవారం మండల ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. గ్రామోదయం, నగరోదయం కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు గుర్తించిన పనులు త్వరగతిన పూర్తిచేసేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వారు గుర్తించిన అంశాలను కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో నిర్వహిస్తున్న కులగణన ప్రక్రియ, దివ్యాంగుల ఓటరు నమోదు, బంగారుతల్లి, ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ, ఆయు ష్మాన్ భారత్ పీఎం ఆరోగ్య యోజన, ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్


పిడుగురాళ్లలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న జేసీ శ్యాంప్రసాద్ తదితరులు

పారదర్శకంగా కులగణన

- సర్వే తీరును పరిశీలించిన జేసీ

దాచేపల్లి, పిడుగురాళ్ల, జనవరి 19: జిల్లాలో కులగణన సర్వే పారదర్శకంగా ఎటువంటి లోపాలు లేకుండా నిర్వహించాలని జేసీ శ్యాంప్రసాద్ తెలిపారు. దాచేపల్లి 10వ వార్డు ఇందిరానగర్‌లో, పిడుగురాళ్లలోని 21వ వార్డులో సర్వే తీరును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సామాజిక వర్గాల వారీగా పథకాలు అమలుకు ప్రభుత్వం కులగణన సర్వే చేపట్టిందన్నారు. పిడుగురాళ్లలో జేసీ వచ్చిన సమయంలో సర్వర్ పనిచేయక పోవడంతో సిబ్బందికి జేసీ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు కరుణకుమార్, చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్లు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బస్సులు లేక.. ఇక్కట్లు

- బస్టాండ్లలో ప్రయాణికుల పడిగాపులు
- అరకొర సర్వీసులతో ప్రయాణానికి పాట్లు
- సీఎం సభకు జిల్లా నుంచి 231 ఆర్టీసీ బస్సులు


నరసరావుపేట బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు పాట్లు

నరసరావుపేట, జనవరి 19: విజయవాడలో శుక్రవారం సీఎం జగన్‌మోహనరెడ్డి సభ ఆర్టీసీ ప్రయాణికులకు చుక్కలు చూపించింది. జన సమీకరణకు ఎక్కడికక్కడ డిపోల నుంచి బ స్సులను కేటాయించారు. దీంతో రోజువారీ, పండుగ సెలవుల అనంతరం సొంతూళ్లకు వెళ్లే వారు బస్సుల కొరతతో ఇక్కట్లు పడ్డా రు. డిపోలు, బస్టాండ్లలో బస్సుల కోసం గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఉన్న అరకొర బస్సులు పెద్దసంఖ్యలో ప్రయాణికులతో కిటకిటలాడాయి. బస్సు ఎక్కేందుకు తోపులాటకు దిగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సంక్రాంతి సెలవుల అనంతరం ప్రయాణికుల రద్దీ ఉంటుందని తెలిసి అత్యధికంగా బస్సులను సీఎం సభకు కేటా యించిన ఆర్టీసీ తీరుపై ప్రయాణికులు మండి పడ్డారు. చంటి పిల్లలతో తల్లులు, వృద్ధులు పడిన అవస్థలు చెప్పనలవికావు. బస్సులను సీఎం సభకు ఏర్పాటు చేసి తమను ఇబ్బం దులకు గురిచేయడం దారుణమని ప్రయాణి కులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, మాచర్ల, పిడుగురాళ్ల, చిలకలూరిపేట డిపోల నుంచి ఉన్న వాటిలో 50 శాతానికి పైగా బస్సులను సీఎం సభ కోసం ఏర్పాటు చేశారు. ఆయా డిపోల్లో 460 ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. వీటిలో 231 బస్సులు విజయవాడ తరలి వెళ్లాయి. ఒక్కో నియోజకవర్గానికి 33 బస్సులు కేటాయించారు. విద్యాసంస్థల బస్సుల కోసం పాఠశాలలు, కళాశాలలకు కూడా సెలవులు ప్రకటించారు.

సెల్ఫీలతో ఫీల్డ్ అసిస్టెంట్ల హాజరు

వినుకొండ టౌన్: విజయవాడలో సీఎం జగన్ సభకు బస్సుల్లో జనాలను తరలించే బాధ్యత గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లపై పడింది. సచివాలయాల వారీగా బస్సుల కేటాయింపుతో వాటి ద్వారా జనాలను విజయవాడకు తరలించాలని అధికారులు ఆదేశించారు. దీంతో బస్సుల వద్దకు జనాన్ని తీసుకువచ్చి వారితో సెల్ఫీలు తీసుకుని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరు వేసుకున్నట్లు సమాచారం. మిర్చి కోతకు వెళ్తే రూ.500 వస్తాయని మహిళలు బస్సులు ఎక్కేందుకు నిరాకరించడంతో ఉపాధి మేట్లు, కూలీలను సమీకరించి బస్సుల్లో తరలించాల్సి వచ్చింది.


బస్సు వద్ద సెల్ఫీ ఫొటో తీసుకుంటున్న ఫీల్డ్ అసిస్టెంట్


బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు



తుళ్లూరు రైతు ధర్నా శిబిరం నుంచి నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

మోసపూరిత పాలనకు చరమగీతం తప్పదు

● పాలకుల ప్రయోజనం కోసమే మూడు ముక్కలాట

● 1494 వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్లూరు జనవరి 19: మోసపూరిత పాలనకు చరమగీతం తప్పదని రాజధాని అమరావతి నిర్మాణానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1494వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు ధర్నా శిబిరాల నుంచి మాట్లాడుతూ అమరావతి ప్రజా రాజధాని అని స్పష్టం చేశారు. మూడు రాజధానులనేది వైసీపీ పాలకుల ప్రయోజనం కోసమేనన్నారు. అమరావతి ప్రాంతం అటు శ్రీకాకుళానికి, ఇటు అనంతపురానికి సమదూరంలో ఉన్నటువంటి ప్రదేశమన్నారు. అన్నీ సౌకర్యాలతో ఏర్పాటు కాబోతున్న అమరావతిని సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కల ఆటతో నాశనం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అమరావతిని అభివృద్ధి చేయాలని ఉన్నత న్యాయస్థానం సూచించినా లెక్కలేకుండా వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. పాలకులు మారినంత మాత్రం రాజధాని మారదన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

కోర్టుకు జగన్ ఎందుకు వెళ్ళటం లేదు?



● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 19: కోడి కత్తి కేసులో సీఎం జగన్ ఎందుకు కోర్టుకు హాజరు కావటం లేదని?, కోర్టులంటే జగన్‌కు అంత భయమెందుకో?, ప్రజలకైనా సమాధానం చెప్పాలని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు డిమాండ్ చేశారు. గత ఐదు సంవత్సరాలుగా జైల్లో మగ్గిపోతున్న ఒక నిరుపేద దళిత యువకుడు శ్రీను కేసులో జగన్ తీరు పైనే అందరికీ అనుమానాలు కలుగుతున్నాయని, కనీసం అతడికి బెయిల్ కూడా రాకుండా అడ్డు పడుతూ జగన్ ప్రజల అనుమానాలను మరింత నిజం చేస్తున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని తన నివాస గృహంలో ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడుతూ నాడు విశాఖ విమానాశ్రయంలో జరిగిన ఘటనలో ఎలాంటి రాజకీయ కోణం లేదని, జగన్ పై అభిమానంతోనే శ్రీను ఆపని చేసినట్టు స్వయానా జాతీయ దర్యాప్తు సంస్థే తేల్చినా మరింత లోతైన విచారణ కోరుతూ జగన్ కేసును సాగ దీయటం ఆయన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కాదా? అని ప్రశ్నించారు. నాడు ఎన్నికల ముందు సొంత బాబాయి వైఎస్ వివేకా హత్య కేసు, కోడి కత్తి కేసు ఘటనలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు పై లేని పోని అభాండాలు వేశారని, ఈ రెండు కేసుల్లో సీబీఐ, ఎన్ఐఏలు వాస్తవాలు వెల్లడించాయని అన్నారు.

భూహక్కుల చట్టం రైతులకు నష్టదాయకం

● రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య

తెనాలి రూరల్, జనవరి 19: ప్రభుత్వం దొడ్డిదారిన తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో ప్రజలకు తీవ్ర నష్టంజరగనున్నదని, ఆ చట్టం రద్దయ్యేంతవరకూ తామంతా పోరాడతామని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. పట్టణంలోని చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో భూ హక్కుల చట్టం - రైతులకు నష్టకరం అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ పెట్టుబడి దారులకు వారు కోరుకున్న రీతిలో భూములను కట్టబెట్టేందుకే ఈ చట్టాన్ని తెచ్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉంటే వారి కబంధహస్తాల్లో భూమి హక్కు ఉండే విధంగా తెచ్చిన చట్టంతో వారసత్వంగా ప్రజలకు వస్తున్న భూములపై హక్కును కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాల్ మాట్లాడుతూ ల్యాండ్ టైట్లింగ్ యాక్టు ద్వారా భూ సంబంధిత వివాదాలను ట్రిబ్యునల్ ద్వారా రెండేళ్ల కాలపరిమితిలో పరిష్కరిస్తామని చెబుతున్నారని అదెలా సాధ్యమని ప్రశ్నించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి, తెలుగు రైతు నాయకులు ఈదర వెంకటపూర్ణచంద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ చందుసాంబశివుడు తదితరులు ప్రసంగించారు. సీనియర్ న్యాయవాది ఎన్‌వి. మహేశ్వరరావు, కెవి సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, కె.పూర్ణచంద్రరావు, వై. బ్రహ్మేశ్వరరావు, ఆళ్ళ సాంబిరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, ఎస్.రాజ్యలక్ష్మి, ఎం.సాంబశివరావు, డి.సాంబశివరావు, అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతిని అడ్డుకుంది జగనే

● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్(చేబ్రోలు), జనవరి 19: మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్థాయిని తగ్గించే విధంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్నారన్ని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ధ్వజమెత్తారు. చేబ్రోలులో శుక్రవారం టీడీపీ, జనసేన పార్టీల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో నరేంద్ర మాట్లాడుతూ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటులో ఆయన పేరుతో సమానంగా జగన్‌రెడ్డి తన పేరు పెట్టుకోవటం మంచిది కాదన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం సబ్‌ప్లాన్‌ను రూపొందించి వారికి ప్రత్యేక నిధులను కేటాయించారని గుర్తు చేశారు. ఆ సబ్‌ప్లాన్ నిధులను దుర్వినియోగం చేసి కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విదేశీ విద్య పథకానికి అంబేద్కర్ పేరును తొలగించి జగన్‌రెడ్డి తన పేరు పెట్టుకొని మహనీయుడిని అవమానించాడని ఆరోపించారు. రాష్ట్రంలో డాక్టర్ సుధాకర్ దగ్గర నుంచి 300లకు పైగా దాడులు దళితులపై జరిగాయని ఆరోపించారు. 27 పథకాలు దళితులకు నిలిపివేసి వారి అభ్యున్నతిని అడ్డుకున్నది జగన్ కాదా అన్ని ప్రశ్నించారు. పొన్నూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు మాట్లాడుతూ వైసీపీ పాలనలో బడుగు బలహీన వర్గాలు, దళితులపై అకృత్యాలు పెరిగిపోయాని ఆరోపించారు. కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్లను నియమించటమే కానీ, కార్యాలయాలు కానీ, నిధులు కానీ విడుదల చేయలేదన్నారు. రైతులను ఆదుకోలేని దౌర్భాగ్య పరిస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. సమావేశంలో నియోజకవర్గ స్థాయి పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని మండలాల టీడీపీ, జనసేన సమన్వయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేమన పద్యాలకు కాలదోషం లేదు

● కొండవీడులో ఘనంగా యోగి వేమన జయంతి వేడుకలు



వేమన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న జిల్లా అటవీశాఖాధికారి రామచంద్రరావు

కొండవీడుకోట(యడ్లపాడు), జనవరి19: వేమన పద్య రూపంలో చెప్పిన హితవచనాలకు కాలదోషం లేదని, భూమ్యాకాశాలు ఉన్నంతవరకూ దిక్సూచిగా నిలుస్తాయని ప్రముఖ గ్రంథ సంపాదకుడు, ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణ అన్నారు. యడ్లపాడు మండలంలోని చారిత్రక కొండవీడుకోటలో ప్రజాకవి యోగి వేమన జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పల్నాడుజిల్లా అటవీశాఖాధికారి ఎస్.రామచంద్రరావు వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవికృష్ణ మాట్లాడుతూ యోగి వేమన గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాహిత్య అభిలాషులు ఇందుకూరి వెంకటరెడ్డి, రేంజ్ అధికారి వెంకటరమణమ్మ, కొండవీడు బీట్ అధికారి పురుషోత్తమరాజు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐడీ విచారణకు తెలుగు యువత నేతలు



సీఐడీ విచారణకు వెళుతున్న తెలుగుయువత నాయకులు ఫిరోజ్, శివకేశవలతో రావిపాటి సాయి, న్యాయవాదులు

గుంటూరు, జనవరి 19: దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ పెట్టిన కేసులో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు షేక్ ఫిరోజ్, ఐ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండి శివ కేశవ శుక్రవారం సీఐడీ విచారణకు హాజరయ్యారు. మైనార్టీ వర్గానికి చెందిన తనను పవిత్ర శుక్రవారం నమాజ్ కూడా చదువుకోనీయకుండా విచారణ పేరుతో మానసిక వేధింపులకు గురిచేశారని ఫిరోజ్ ఆవేదన వ్యక్తం చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం 30 నుంచి 40 ప్రశ్నలు వేసి తమ మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు జప్తు చేసారని వాపోయారు. తమను ఈ నెల 30న రావాలని మరో నోటీసు ఇచ్చారని తెలిపారు. ఇద్దరితో పాటు న్యాయవాదులు మాజీ పి.పి శ్రీరామ్ రాజీవ్ ఆనంద్, హైకోర్టు న్యాయవాది పొన్నం రవీంద్రబాబు విచారణకు హాజరయ్యారు. గుంటూరు పశ్చిమ టీడీపీ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ, రాష్ట్ర మైనారిటీ నేతలు హస్సేన్, బాజీ మాస్టర్, షేక్ నాయబ్ రసూల్, షేక్ రషీద్, ఐ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బేతమల మనిరత్నం, కోసూరి సతీష్ గౌడ్, మల్లెంపూడి శ్రీనివాస రావు, కొల్లి నాగుల్ షేక్ సుభాని, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షులు గుత్తికొండ కిరణ్ యాదవ్, తెలుగుయువత నాయకులు షేక్ రఫీ, చిక్కాల శివరామ కృష్ణ, శొంఠినేని అనిల్, శేషాద్రి సాంబశివరావు, గాలి ఉపేంద్ర, బుల్లా కుమార్ బాబు, కళ్యాణ్ తదితరులు వారికి సంఘీబావం తెలిపారు.

గాజువాకలో గుంటూరు యువకుడి ఆత్మహత్య

విశాఖపట్నం, జనవరి 19: విశాఖ నగరం గాజువాకలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో యువకుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి...గుంటూరు నగరానికి చెందిన ఎస్.సాయికృష్ణ (26) గాజువాకలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో పనిచేసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. దీంతో పాటు ఫుడ్ డెలివరీ బాయ్‌గా కూడా పనిచేస్తున్నాడు. కాగా సాయికృష్ణ తండ్రి ఇటీవల గాజువాక వచ్చి సంక్రాంతికి ఇంటికి రావాలని చెప్పి వెళ్లిపోయాడు. అయినప్పటికీ సాయికృష్ణ స్వగ్రామం వెళ్లలేదు. శనివారం ఉదయం హాస్టల్‌లో అతడి గది తలుపు ఎంతకీ తీయకపోవడంతో అనుమానం వచ్చిన సిబ్బంది తలుపు తెరచి చూడగా, ఫ్యాన్ హుక్కుకు ఉరి వేసుకుని ఉన్నాడు. దీంతో వారు వెంటనే గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలంలో వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

● ఏపీఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ త్రివిక్రమ వర్మ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీజీ త్రివిక్రమ వర్మ

పెదకాకాని, జనవరి19: క్రమం తప్పకుండా రోజు క్రీడలు ఆడటం వల్ల మానసిక ఉల్లాసం, దేహధారుఢ్యం కలుగుతుందని ఏపీ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీఎం త్రివిక్రమ వర్మ తెలిపారు. సీఎం జగన్ ప్రతిపాదించిన ఆడుదాం ఆంధ్రాలో భాగంగా శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏపీఎస్పీఎఫ్ స్పోర్ట్స్ మీట్- 2024ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా త్రివిక్రమవర్మ మాట్లాడుతూ ఏపీఎస్పీఎఫ్‌లో రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. విజయవాడ, రాజమండ్రి, రాయలసీమ జోన్‌ల నుంచి 100 మంది ఏపీఎస్ఎఫ్ సిబ్బంది హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలలో ఎస్పీఎఫ్ ఐజీ బి.వి.రామిరెడ్డి, ఎస్పీఎఫ్ విజయవాడ జోన్ కమాండెంట్ ఎం.శంకర్రావు, అసిస్టెంట్ కమాండెంట్ కె.కృష్ణమూర్తి, కమాండెంట్ కెవీఎస్ గుప్త, అసిస్టెంట్ కమాండెంట్‌లు మల్లికార్జున్‌రావు, డి.శంకర్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో ఉపాధ్యాయుడు అరెస్టు

పిడుగురాళ్ల, జనవరి 19: బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఉపాధ్యాయుడు షేక్ ఆదాంషఫీవుల్లాను శుక్రవారం పిడుగురాళ్ల పోలీసులు అరెస్టు చేశారు. మైనర్‌పై జరిగిన ఘటనను దళిత సంఘాలు, ప్రజాసంఘాల నేతలు తీవ్రంగా ఖండిస్తూ నిందితుడిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



భానుప్రకాష్ మృతదేహం

యడ్లపాడు, జనవరి 19: ముందు వెళుతున్న కారును వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పదహారో నంబరు జాతీయ రహదారిపై యడ్లపాడు వద్ద గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేపల్లెకు చెందిన సుఖవాసి భానుప్రకాష్(43), సాంబశివరావు, హేమంత్‌కుమార్, విజయవాడకు చెందిన శ్రీనాథ్‌లు విజయవాడ నుంచి తిమ్మాపురంలోని బంధువు ఇంటికి కారులో బయలుదేరారు. యడ్లపాడు ఎస్ఎస్ఎల్ వద్దకు రాగానే కారును వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. కారు వెనుక సీటులో కూర్చున్న భానుప్రకాష్, హేమకుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108వాహనంలో చిలకలూరిపేటలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో భానుప్రకాష్ మృతిచెందాడు. మృతునికి భార్య రాధిక, ఒక కుమార్తె ఉన్నారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు దిగుతూ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి మృతి




పాతూరి రవిచంద్ర (ఫైల్)

పిడుగురాళ్ళ, జనవరి 19: రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి మృతి చెందిన ఘటన శుక్రవారం పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లో జరిగింది. ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి పాతూరి రవిచంద్ర(33) కుటుంబం సంక్రాంతి పండుగకు పిడుగురాళ్ల వచ్చింది. వారికోసం రవిచంద్ర హైదరాబాద్ నుంచి పిడుగురాళ్ల వచ్చి రైలు దిగుతుండ గా జారిపడి తీవ్రగాయాలు అయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో రవిచంద్ర మృతి చెందాడు. మృతునికి భార్య, ఇరువురు పిల్లలు వున్నారు.

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

బాపట్లరూరల్, జనవరి 19: పురుగుల మందు తాగి యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాపట్లరూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని కొండుభొట్లవారిపాలెం గ్రామానికి చెందిన ఎస్.హేమంత్ (22) అనే యువకుడు తమ తల్లిదండ్రులను బైక్ కొనుక్కోవాలని డబ్బులు అడగగా వారు నిరాకరించటంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగాడు. వెంటనే ఆ యువకుడిని కుటుంబ సభ్యులు బాపట్ల ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చారు. మెరుగైన వైద్యం కోసం పొన్నూరు తరలించగా మార్గ మధ్యంలో యువకుడు మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



వేణుబాబు మృతదేహం

ప్రత్తిపాడు, జనవరి 19: స్కూలు బస్సు ఢీ కొని ద్విచక్ర వాహనదారుడు మరణించిన ఘటన ప్రత్తిపాడు మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెం వద్ద శుక్రవారం జరిగింది. ప్రత్తిపాడు పోలీసుల కథనం ప్రకారం బాపట్ల జిల్లా పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన వెల్లటూరి వేణుబాబు (38), గణేష్ మణికంఠారెడ్డిలు ద్విచక్రవాహనంపై గుంటూరు వైపు వెళుతున్నారు. అయితే తిక్కిరెడ్డిపాలెం వద్ద ముందు వెళుతున్న కారును ఓవర్‌టేక్ చేస్తుండగా గుంటూరు వైపు నుంచి వస్తున్న స్కూల్ బస్ వీరిని ఢీ కొంది. దీంతో ముందు ఉన్న వేణుబాబు అక్కడికక్కడే మరణించగా, వెనుక ఉన్న గణేష్‌మణికంఠారెడ్డికి కాళ్లు చేతులు విరిగి పోయాయి. వెంటనే ఇతన్ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ రవీంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ హయాంలో దళితులకు అన్యాయమే

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జనవరి 19: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక 6 వేల మందికి పైగా దళితులపై ముఖ్యమంత్రి దాడులు చేయించారని గురజాల మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 188 మంది దళితులను హత్యలు చేశారని, రోజు ఇద్దరు ముగ్గురు దళితులపై దాడులు, ఆరుగురిపై హత్యాయత్నాలు, వారానికి ముగ్గురు దళిత మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దళితులకు రాజ్యాంగ బద్ధంగా అందాల్సిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిన జగన్ ఏమి ఉద్దరించాడని అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరణ చేస్తున్నాడన్నారు. కొవిడ్ సమయంలో మాస్క్ అడిగిన దళిత వైద్యుడు సుధాకర్‌ను దారుణంగా హత్యచేయడమే కాకుండా మరో దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన ఘనత వైసీపీ నేతలదేనన్నారు. టీడీపీ హయాంలో 4 లక్షల మంది దళిత సోదరులకు ఉపాధి కల్పించిన ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి విదేశీ విద్యను దూరం చేశారని అన్నారు. దళితులు ఆత్మగౌరవంతో సగర్వంగా బతికేందుకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ల్యాండ్ పర్చేజింగ్ స్కీమ్‌ను తీసుకొస్తే జగన్ ఆ పథకాన్ని రద్దు చేశాడన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా వున్న 50 వేల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకపోగా చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ అందుబాటులోకి తీసుకొస్తే జగన్ దానిని కూడా పక్కన పెట్టేశాడన్నారు. ఎస్సీ, ఎస్టీ చెల్లెమ్మల వివాహానికి వైఎస్ఆర్ పెళ్లికానుక లక్ష రూపాయలు ఇస్తానని మేనిఫెస్టోలో చెప్పి ఒక్కరికి ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. కోడికత్తి డ్రామాలో దళితబిడ్డ శ్రీనివాసును, అయేషామీరా కేసులో సత్యంబాబును ఏళ్లతరబడి జైలుపాలు చేశారన్నారు. జంగారెడ్డిగూడెంలో జరిగిన కల్తీమద్యం మృతులలో 12 మంది దళితులు మృతిచెందారన్నారు. అక్రమ ఇసుక రవాణాను ప్రశ్నించిన వరప్రసాద్‌కు గుండుగీయించి మాస్క్ పెట్టుకోలేదని చీరాలకు చెందిన దళిత యువకుడు కిరణ్‌ను పోలీసులు కొట్టి చంపారని, మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న రామకృష్ణ సోదరుడు రామచంద్రపై దాడి చేయడమే కాకుండా పులివెందులలో దళిత మహిళ పై అత్యాచారం చేశారన్నారు. ఆర్థిక నేరగాళ్లు అంతా వైసీపీలోనే వున్నారని యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు.

దళిత ద్రోహి సీఎం జగన్

● మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



మాట్లాడుతున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 19: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విదేశీ విద్య పథకానికి పేరు మార్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దళితులను అగౌరవపరిచారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో 125 వేల అడుగులకు తొక్కి. 125 అడుగుల విగ్రహం పెడితే దళితులకు మీరు చేసిన పాపాలు పోతాయా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దళితులను గౌరవిస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరుపై విదేశీ విద్యను ప్రవేశపెట్టి 10 నుంచి 15 లక్షల మందికి పైగా విద్యార్థులకు విదేశీ విద్యను అందించడం జరిగిందన్నారు. నాలుగేళ్ల వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు జగన్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు విదేశాలకు పంపలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 6వేల మంది దళితులపై దాడికి పాల్పడి 180మంది దళితులను హతమార్చిన దళిత ద్రోహి జగన్ అని అన్నారు. దళితులపై ప్రేమ ఉంటే బ్లాక్ లాక్ పోస్టులు ఎందుకు భర్తీ చేయలేదని ఆయన ప్రశ్నించారు. దళితవాడలకు 200 యూనిట్ల లోపు కరెంటు చంద్రబాబునాయుడు ప్రకటిస్తే జగన్ ప్రభుత్వం ఉచిత కరెంటు ఎత్తేసి దళితుల ముక్కు పిండి బిల్లులు వసూలు చేశారన్నారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పెట్టినంత మాత్రాన నీవు చేసిన పాపాలు దళితులు మరచిపోరని, విగ్రహాన్ని ఆవిష్కరించే నైతిక హక్కు మీకు లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వార్థ రాజకీయాలతో పచ్చగా ఉన్న పల్లెల్లో గొడవలు పెట్టి ప్రజల మధ్య చిచ్చు రేపుతున్నారన్నారు. బొల్లా అవినీతిని ప్రశ్నించినవారిపై దాడులు, హత్యాయత్నాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో బ్రహ్మనాయుడు అహంకారానికి, అవినీతి, అక్రమాలకు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో ఐఏఎస్ అకాడమి చైర్మన్ పారా లక్ష్మయ్య, డీఎల్‌డీఏ చైర్మన్ లగడపాటి వెంకట్రావు, నియోజకవర్గ పరిశీలకుడు మానుకొండ శివప్రసాద్, బచ్చు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ పేరు పలికే అర్హత జగన్‌కు లేదు

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

బెల్లంకొండ, జనవరి 19: రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ పేరును పలకటానికి కూడా ఈ రాష్ట్ర ముఖ్యమంత్రికి ఏ మాత్రం అర్హత లేద ని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహోన్నతమైన వ్యక్తి బాబా సాహెబ్ అంబేద్కర్ అన్నారు. అలాంటి వ్యక్తి పేరుతో గతంలో తెలుగుదేశం పార్టీ అంబేద్కర్ విదేశీ విద్య అని పేరు పెడితే ప్రస్తుతం ఆ పేరును తొలగించి వైఎస్ విద్య అని పేరు పెట్టారని అన్నారు. అటువంటి వ్యక్తి మళ్ళీ అంబేద్కర్ పేరు చెప్పి విగ్రహావిష్కరణ అంటూ దళితుల ఓట్లను దండు కోవటం కోసం కుట్ర జరుగుతుం దన్నారు. నిజంగా ముఖ్యమంత్రికి అంబేద్కర్ పై ప్రేమ ఉంటే తక్షణమే వైఎస్ఆర్ విదేశీవిద్య పేరు మార్చి అంబేద్కర్ విదేశీ విద్యను పేరును కొనసా గించాలని డిమాండ్ చేశారు. అణగారిన వర్గాల కోసం గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, ఎస్సీ కార్పొరేషన్ లోన్‌లను ప్రదేశ పెడితే ప్రస్తుత ప్రభుత్వం వాటిని రద్దు చేసి మోసం చేశారని విమర్శించారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి దళితుల పాలిట శాపంగా మారారని విమర్శించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119, 130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 80,758 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 90,534 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 41,325 టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఇలా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	21000
నెంబరు. 5	10000	19000
273	12000	16500
341	10000	19000
4884	11500	16000
సూపర్ 10	15000	15000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	9000	19000
దేవనూరుడీలక్స్	8000	20000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
తెల్లకాయలు	5000	13000
ఏసీ కామన్ వెరైటీ		
334	--	--
నెంబరు. 5	--	--
273	--	--
341	14000	15200
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	16500	18500
బ్యాడిగి	11000	18000
దేవనూరుడీలక్స్	--	--
తెల్లకాయలు	6000	12500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

దళితుల ఓట్ల కోసమే అంబేద్కర్ విగ్రహావిష్కరణ

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

మాచర్ల, జనవరి 19: దళితుల ఓట్ల కోసమే ఎన్నికలకు ముందు అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్నారని, విగ్రహాలను పెట్టి దళితులను మభ్యపెట్టాలని చూడడం జరగని పని అని టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో దళిత వర్గాలు తమకు జరిగిన అన్యాయంపై ఆగ్రహంగా ఉన్నారన్నారు. దళితులకు మేనమామను అంటూ వారి ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ అధికార మదంతో కంసమామగా మారి దళితులను హింసిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే దుర్గి మండలం ఆత్మకూరులో దళితులు టీడీపీకి అండగా ఉన్నారనే అక్కసుతో గ్రామ బహిష్కరణ చేశారన్నారు. మాచర్లలో తమ అభిమాన నేతను అసభ్యకరంగా చిత్రీకరిస్తూ ఫ్లెక్సీలు వేస్తుంటే తమ పార్టీకి చెందిన దళిత యువకుడు అడ్డుకుంటే తల పగులకొట్టారని గుర్తు చేశారు. కారంపూడి మండలంలో అధికార పార్టీ వెంట నడవలేదని తప్పుడు ఫిర్యాదులతో పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురి చేశారన్నారు. కోడి కత్తి శ్రీనును యేళ్ల తరబడి జైల్లో మగ్గేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైసీపీ పాలనకు చరమగీతం పాడేందుకు దళితులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారని బ్రహ్మారెడ్డి అన్నారు.

దళితుల గురించి మాట్లాడే హక్కు వైసీపీ నేతలకు లేదు

● టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పణితి

పిడుగురాళ్ల, జనవరి 19: దళితుల సంక్షేమాన్ని విస్మరించి అనేక పథకాలను రద్దు చేసిన ముఖ్యమంత్రి జగన్ దళితుల గురించి మాట్లాడే హక్కు లేదని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పణితి రవికుమార్ తెలిపారు. పిడుగురాళ్లలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం నిరసన తెలిపారు. కోడికత్తి శ్రీను దళితుడు కాబట్టే ఐదేళ్లుగా జైల్లోనే మగ్గిపోతున్నాడని, విశాఖలో వైద్యులు సుధాకర్‌తో పాటు మరెందరో అన్యాయమైపోయారన్నారు. ఈ కార్యక్రమంలో చిలకా చిన్న, వర్ల రత్నం, పణితి కృష్ణ, ఐతం దేవదానం, గారపాటి సంగీతరావు, పణితి కాంతారావు, చల్లగుండ్ల రూబేన్, బొక్కా శ్రీను, గేరా రవికుమార్, పణితి అఖిల్, కనుమూరి సాగర్ తదితరులున్నారు.

● దాచేపల్లి, జనవరి 19: విగ్రహాలు పెట్టి దళితులను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఎస్సీసెల్ రాష్ట్ర విభాగం నాయకులు చిలుముల దుర్గారావు ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై ఆరు వేలకు పైగా దాడులు జరిగాయన్నారు. 188 మంది దళితులను హత్యచేశారన్నారు. దళిత మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని తెలిపారు. 27 సంక్షేమ పథకాలను రద్దు చేశారన్నారు. యరమాల బుజ్జి, వేల్పుల ముత్తయ్య, బండ్ల ప్రభుదాసు, వట్టెపు సుందరరావు, కె ప్రభుదాసు, తదితరులు పాల్గొన్నారు.

● గురజాలటౌన్, జనవరి 19: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లేదని మండల ఎస్సీ నేతలు మండిపడ్డారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. దళితుడైన కోడి కత్తి శ్రీనుకు ఐదేళ్లుగా బెయిల్ రాకుండా చేసిన దళిత ద్రోహి జగన్ అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఏసుపొంగు రాంబాబు, ప్రసంగి, దావీదు, దానయ్య, చింతకాయల కల్యాణి, కుక్కమూడి కల్యాణ్, మాలపాటి శ్యాంబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు నేలవల్లి బొల్లయ్య, చాగంటి శ్రీను, శరమాళ్ల హనుమంతరావు, ఉప్పిడి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి, జనవరి 19 : వైసీపీ ప్రభు త్వంలో దళితులపై జరుగుతున్న దమనకాండ కు నిరసనగా, కోడి కత్తి కేసులో ఐదు సంవత్సరాలుగా జైలులో మగ్గిపోతున్న శ్రీనుకు మద్దతుగా సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఇప్పుడు విజయవాడలో అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పటం దళితులను మోసం చేయటమేనన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో దళిత నేతలు బొక్కా సంగీతరావు, బందారు నాగరాజు, పల్లె మార్కురాజు, బలిజేపల్లి సురేష్, గుంటూరు ఆశీర్వాదం, బొజ్జా కాంతారావు, శనగపూల నరసింహారావు, గుల్లా నాగరాజు, చిలకా శ్యామ్, గుజ్జర్లపూడి చంద్రకాంత్, చింతపల్లి అజయ్, గొలమాల ప్రభుదాసు, వెలిశల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

● క్రోసూరు, జనవరి 19 : సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల్లో లబ్ధి పొందటానికి మహానుభావుడైన అంబేద్కర్ విగ్రహాన్ని అడ్డు పెట్టుకోవటం సిగ్గుచేటని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి దుద్దుల యోహాన్ విమర్శించా రు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి చేసిన తప్పులను ఎస్సీ, ఎస్టీలు క్షమించరన్నారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన 27 పథకాలను రద్దు చేశారన్నారు. ఆయన వెంట టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు చిలకా రవికు మార్, బుల్లెయ్య, చిలకా ఎర్ర శ్రీను, పగడాల రాజు, చిలకా కృష్ణారావు, చిలకా ఆదెయ్య, ఏసుబాబు, బసవయ్య తదితరులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు అంగన్‌వాడీల తరలింపు



పోలీస్‌స్టేషన్‌లో కూర్చున్న అంగన్‌వాడీలు

పిడుగురాళ్ల, జనవరి 19: న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం కూడా కొనసాగింది. ఛలో విజయవాడ పిలుపు మేరకు అంగన్‌వాడీలు వెళ్తారన్న సమాచారంతో పిడుగురాళ్లలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు ముందస్తు హౌస్ అరెస్టు చేయడంతో పాటు మరికొందరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆర్‌అండ్‌బి బంగ్లా వద్ద ప్రభుత్వ మొండి వైఖరిని నిరశిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా కొనసాగించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ఏపూరి గోపాలరావు, సీఐటీయూ నాయకులు తెలగపల్లి శ్రీను, హజ్రా, శాంతమణి, శివరంజని, బాజీబీ, జయకుమారి, రమాదేవి, ధనలక్ష్మీ, అరుణ, విజయరాణి, శివపార్వతి, మాధవి పాల్గొన్నారు.

● క్రోసూరు, జనవరి 19 : క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు, హెల్పర్లు తమ డిమాండ్ల సాధన కోసం నిరసన దీక్షలు కొనసాగిస్తున్నారు. శుక్రవారం అంగన్ వాడీల సమ్మె 39వ రోజుకు చేరింది. ప్రభుత్వం తమ డిమాండ్లు పట్టించుకోకపోగా కక్ష సాధింపు చర్యలకు దిగటం, ఉద్యోగాల నుంచి తొలగిస్తా మని బెదిరించటం దుర్మార్గమని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు అన్నారు. నిరసన దీక్షలో అంగన్‌వాడీలతో పాటు సీఐటీయూ నాయకులు జీ.రవిబాబు, తిమ్మిశెట్టి హనుమంతరావు పాల్గొన్నారు.

● అమరావతి, జనవరి 19: న్యాయపరమైన తమ సమస్యల పరిష్కారం కోసం గత 39రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్న అంగనవాడీ కార్యకర్తలపై సూపర్‌వైజర్లు, వైసీపీ నాయకులు బెదిరింపు చర్యలకు పాల్పడుతూ దీక్షలను భగ్నం చేసేపనిలో ఉన్నారని వారికి అంగన్‌వాడీల ఉసురు తప్పక తగులుతుందని సీఐటీయూ నాయకులు బి.సూరిబాబు అన్నారు. అంగనవాడీ కార్యకర్తలు చేస్తున్న నిరసన దీక్షకు శుక్రవారం సంఘీభావం తెలిపి ప్రసంగించారు. అట్టహాసంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి రాజ్యాంగం ద్వారా పేదలకు లభించిన హక్కులను కాలరాస్తున్నారని అన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు



ఆర్టీసీ డిపోలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

పిడుగురాళ్ల, జనవరి 19: విజయవాడలో సీఎం సభకు పిడుగురాళ్ల డిపో నుండి అత్యధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సులు కేటాయించడంతో ప్రయాణికులు బస్సులు లేక నానా అవస్థలు పడ్డారు. ఎక్కువ మంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి అధిక ధరలకు ప్రయాణం చేయాల్సి వచ్చింది. పిడుగురాళ్ల మహిళా సమాఖ్య సిబ్బంది, పొదుపు సంఘాల సభ్యులను కూడా సీఎం సభకు తరలివెళ్లేలా మెసేజ్‌లు, ఫోన్లు చేసి బస్సుల వద్దకు మహిళలను కూడా తరలించారు.

టీడీపీ కార్యకర్తలకు సన్మానం

సత్తెనపల్లి, జనవరి 19 : సత్తెనపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా విభాగానికి చెందిన టీడీపీ యాప్‌లో చురుగ్గా పని చేస్తున్న కార్యకర్తలను శుక్రవారం సాయంత్రం పట్టణంలోని రఘు రామ్ నగర్‌లో గల టీడీపీ ప్రజా వేదికలో గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారికి టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన పార్టీ జెండాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి కమ్మా సుధాకర్‌రెడ్డి, నియోజక వర్గ ఐటీడీపీ అధ్యక్షుడు రావిపాటి ప్రసాదు, నూర్‌బాషా జాన్‌బాబు పాల్గొన్నారు.

సైకో పాలనకు చరమగీతం పాడాలి

● టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జనవరి 19 : సైకో ప్రభుత్వానికి త్వరలో చరమగీతం పాడాలని టీడీపీ సత్తెన పల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని పృథ్వీ అపార్ట్‌మెంట్‌లో అపార్ట్‌మెంట్ వాసులు సమా వేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జగన్ అధికారం చేపట్టిన దగ్గర నుంచి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారన్నారు. అన్ని వర్గాలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. పారిశ్రామికవేత్త దరువూరి నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, కొండు సూర్యనారాయణ, చింతపల్లి వెంకటాద్రి, బొడ్డు రామారావు, అజయ్ కుమార్, సంపూర్ణ, పూజల వెంకట కోటయ్య, దివ్వెల శ్రీనివాసరావు, సుధాకర్, పలువురు అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయాలి

టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ తెలుగు యువత పట్టణ మాజీ అధ్యక్షుడు ఎలినేడి శ్రీనివాస్ ఈనెల 20వ తేదీ ఉదయం సత్తెనపల్లి నుంచి తిరుమలకు జరగనున్న పాదయాత్రలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా పాల్గొని జయప్రదం చేయాలని టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కోరారు. రాష్ట్రంలో కొనసాగుతున్న సైకో పాలన కూడా అంతమవ్వాలని ఎలినేడి శ్రీనివాస్ స్వామి వారి వద్దకు పాదయాత్ర చేయటం అభినందనీయమన్నారు. తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు ఎలినేడి లక్ష్మీతులసీ, ఎలినేడి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావాలని, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని, సత్తెనపల్లి ఎమ్మెల్యేగా కన్నా లక్ష్మీనారాయణ గెలవాలని, నారా లోకేశ్ నాయకత్వం వర్ధిల్లాలని వేంకటేశ్వర స్వామిని వేడుకుంటూ శనివారం ఉదయం రఘు రామ్ నగర్‌లోని తమ గృహం వద్ద నుంచి వడ్డవల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం వరకు ఎదురు నడిచి అక్కడి నుంచి తిరుమల వరకు పాదయాత్ర చేయటం జరుగుతుందన్నారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

పట్టణంలోని రఘు రామ్ నగర్‌లో గల పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఎలినేడి లక్ష్మీ తులసీ శ్రీనివాస్ గృహం వద్ద ఎలినేడి శ్రీనివాస్ తిరుమలకు చేపట్టిన పాదయాత్ర సందర్భంగా వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో కన్నా లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి దంపతులతో పాటు పలువురు టీడీపీ నేతలు కూడా పాల్గొన్నారు.

కన్నాకు సన్మానం

టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన దివ్వెల శ్రీనివాసరావు శుక్రవారం రఘు రామ్ నగర్‌లోని కన్నా కార్యాలయంలో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గోగినేని కోటేశ్వరరావు, పూజల వెంకట కోటయ్య, పూదోట రాజు, జానీ ఖాజావలి, ఎస్.వెంకటరావు, డీ.జానకి రామారావు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకం తో పదవి ఇచ్చిన కన్నా లక్ష్మీనారాయణ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.



జనసేన నేతలతో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

సమన్వయంతో పనిచేసి విజయం సాధిద్దాం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

కారంపూడి, జనవరి 19: అందరం సమన్వయంతో పనిచేసి విజయం సాధిద్దామని టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మండలంలోని ఒప్పిచర్లలో శుక్రవారం ఆయన జనసేన నేతలతో సమావేశమయ్యారు. వైసీపీ అరాచక పాలనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. మాచర్ల నియోజకవర్గంలో ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేలా ఉమ్మడి పోరాటం చేద్దామన్నారు. రానున్న ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేద్దామన్నారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త బూసా రామాంజినేయులు, మండల అధ్యక్షుడు కేశనపల్లి కృష్ణబాబు, పట్టణ అధ్యక్షుడు తెలగనేని లక్ష్మయ్య, ఒప్పిచర్ల అధ్యక్షుడు కూరాకుల కోటేశ్వరరావు, మండల యువత కన్వీనర్ ఒంగూరి సుబ్బారావు, నరమాలపాడు అధ్యక్షుడు ఈతిరాజు నాగేశ్వరరావు, ముళ్లపాటి కొండ, సైదావలి, బొజ్జయ్య, హేమంత్, నాగేశ్వరరావుపాల్గొన్నారు.

క్రీడలు ఆరోగ్యవంతమైన జీవితాన్నిస్తాయి : ఎస్ఈ

రెంటచింతల, జనవరి 19 : క్రీడలు ప్రతి వ్యక్తిని ఆరోగ్యంగా, మానసికంగా ధృడంగా తయారు చేయడంతోపాటు భావోద్వేగ నైపుణ్యాలను పెంపొందించే అవకాశాలను అద్భుతంగా మెరుగుపరుస్తాయని నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఎస్ఈ వేంకటరమణ అన్నారు. గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఇంజనీర్లకు, ఇతర ఉద్యోగులకు ఆటల పోటీలను నిర్వహించారు. తొలిరోజు షటిల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఈ నాగరాజు, డీఈఈలు మహ్మద్, జయశంకర్, గిరిబాబు, ఎస్పీఎఫ్ ఎస్ఐ ఆర్.గురుమూర్తి, ఫోర్‌మెన్ సుబ్బారావు పాల్గొన్నారు.

టెయిల్‌పాండ్ ఈఈగా సుబ్రహ్మణ్యం

రెంటచింతల, జనవరి 19 : సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఈఈ(సివిల్)గా బీఎస్ సుబ్రహ్మణ్యంను నియమిస్తూ జెన్‌కో ఎండీ చక్రధర బాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్ఈ వేంకటరమణ చెప్పారు. ఈయన విజయవాడ విద్యుత్ సౌదా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారన్నారు. ఇప్పటి దాకా ఇక్కడ శ్రీశైలం కుడిగట్టు విద్యుత్ కేంద్రానికి చెందిన రమేష్ ఇన్‌చార్జి ఈఈగా పని చేశారన్నారు.

21న కుంకలగుంటలో ఉచిత మెగా వైద్య శిబిరం

నకరికల్లు, జనవరి 19 : కుంకలగుంటలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఈనెల 21వ తేదీ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి తెలిపారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, ఈసీజీ, ఎకో, టీబీ, దగ్గు, నెమ్ము, ఆయాసం, విష జ్వరాల కోసం, కీళ్ళ నొప్పులకు, ఎముకలకు, చెవి, ముక్కు, గొంతు, కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన మందులు అందజేయనున్నట్లు తెలిపారు. కాటూరి మెడికల్ హాస్పటల్, ఎన్‌జీవెస్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

రైతుల సమస్యలను పట్టించుకోని మంత్రి

సత్తెనపల్లి, జనవరి 19 : రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు రోడ్ల పై డ్యాన్స్‌లు వేయటం తప్పా రైతుల సమస్యలను పట్టించుకోవటం లేదని టీడీపీ నేతలు అన్నారు. టీడీపీ ప్రజా వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చివరి భూములకు, మంచి నీటి చెరువులను నింపుకోవటానికి అదనంగా రెండు, మూడు టీఎంసీల నీటిని ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, నియోజకవర్గ అధ్యక్షులు రావిపాటి నానయ్య, టీడీపీ అధికార ప్రతినిధి కంభాల వెంకటేశ్వర్లు, తెలుగు రైతు మండల అధ్యక్షుడు బండారుపల్లి నరసింహారావు ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ హర్షణీయం : పీఆర్కే



బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పీఆర్కే

మాచర్ల, జనవరి 19 : విజయవాడలో 206 అడుగుల అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణ ఎంతో హర్షణీయమని ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరించనుండడంతో మాచర్ల నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు ఆర్టీసీ బస్సులు, వివిధ వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఈ వాహనాలను ఎమ్మెల్యే పీఆర్కే జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, బూడిద శ్రీనివాసరావు, బోయ రఘురామిరెడ్డి, ఆరికట్ల చంద్రశేఖరరెడ్డి, జడ్పీటీసీ మల్లుస్వామి, కొత్తపల్లి సర్పంచ్ జయప్రకాష్‌రెడ్డి, ఉప్పలపాడు జానీ తదితరులు పాల్గొన్నారు.

ఫారం- 7 ఫిర్యాదులపై విచారణ జరపాలి

● అధికారులకు నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆదేశాలు

సత్తెనపల్లి, జనవరి 19 : సత్తెనపల్లి నియోజకవర్గంలో మంత్రి అంబటి రాంబాబు కార్యాలయంలోని కంప్యూటర్ నుంచి అంబటి కార్యాలయ ఉద్యోగ గుడిమెట్ల రమేష్ టీడీపీ ఓట్లను తొలగించాలని తప్పుడు ఫారం-7లు దాఖలు చేశారని, విచారించి చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విచారణ చేయనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి రాజకుమారి శుక్రవారం తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని తహసీల్దార్లు, అసిస్టెంట్ ఎన్నికల అధికారులపై ఫారం-7ల అవకతవకలపై లోతైన విచారణ జరిపి ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. అవకతవకలకు సంబంధించిన నివేదికలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. టీడీపీకి చెందిన ఓటర్లను లక్ష్యంగా చేసుకొని స్థానిక వైసీపీ కార్యాలయంలో ఒకే కంప్యూటర్‌లో ఈ దరఖాస్తులు సమర్పించినట్లు ఆళ్ళ అమరేశ్వరరావు ఫిర్యాదు చేసినట్లు ఆమె తహసీల్దార్లకు కూడా తెలియజేశారు.

కాపు సంఘం మండల అధ్యక్షుడిగా జగన్

బెల్లంకొండ, జనవరి 19 : బెల్లంకొండ మండలం కాపు సంఘం అధ్యక్షుడిగా గంగిరెడ్డి పాలెం మాజీ సర్పంచ్ ఆసుల జగన్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాపునాడు జాతీయ అధ్యక్షులు గాండ్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జిల్లా కాపు నాడు అధ్యక్షుడు పీ.వెంకట సత్యనారాయణ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు.

ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలి

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్



లోకేశ్‌ను శాలువాతో సత్కరిస్తున్న సాయి సుధాకర్, కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, జనవరి 19 : రాష్ట్రంలో సైకో పాలనకు ప్రజలు చరమగీతం పాడతామని, ఇందుకు రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేసే విధంగా చూస్తామని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌ను ఉండవల్లిలోని గృహంలో శుక్రవారం కలసి నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు. శ్రీధర్ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమయ్యారని, పెరిగిన ధరల వల్ల పేద, మధ్య తరగతి ప్రజల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నియోజకవర్గంలో టీడీపీతో పాటు జనసేన సైనికులతో కలసి నియోజకవర్గంలో తెలుగుదేశం జెండాను ఎగురవేస్తామన్నారు. ఆయన వెంట శ్రీధర్ తనయుడు, నియోజకవర్గ తెలుగు యువత నేత కొమ్మాలపాటి సాయి సుధాకర్ కూడా లోకేశ్‌ను కలసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వటం ఖాయం : వెన్నా



సమావేశంలో మాట్లాడుతున్న వెన్నా సాంబశివారెడ్డి

బెల్లంకొండ, జనవరి 19 : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొంది ముఖ్యమంత్రి అవ్వటం ఖాయమని గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి అన్నారు. మండలం లోని చంద్రాజుపాలెంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు సమావేశాల్లో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందిందని గొప్పలు చెప్పకోవటమే తప్పా ఎక్కడా కూడా అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో కొమ్మాలపాటి సాయి సుధాకర్, జ్యోతి సముద్రం, వెన్నా సీతారామిరెడ్డి, గుంజా గంగారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇమ్మానియేలు మృతి పార్టీకి తీరని లోటు

చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఇమ్మానియేలు మృతి పార్టీకి తీరని లోటు అని గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, నియోజకవర్గ యువ నాయ కుడు కొమ్మాలపాటి సాయి సుధాకర్ అన్నారు. చంద్రాజుపాలెంలో ఇమ్మానియేలు మృతదేహంపై శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, బీసీ సంఘం మండల అధ్యక్షుడు గుంజా గంగారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఓర్సు రాంబాబు, లక్ష్మయ్య, శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒక్క ఛాన్స్‌తో అంధకారంలోకి రాష్ట్రం

పెదకూరపాడు, జనవరి 19 : ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిందని గుంటూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి అన్నారు. మండలంలోని కస్నెగండ్లలో శుక్రవారం నియోజకవర్గ తెలుగు యువతనేత కొమ్మాలపాటి సాయి సుధాకర్‌తో కలసి పర్యటించారు. సాంబశివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవటంతో ఉపాధి అవకాశాల కోసం యువత వలసి వెళ్ళిపోతున్నారన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, వెల్లలచెరువు సురేష్ ఉన్నారు.

ఏఎంఈ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్



ఏవియేషన్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన 'ఏఎంఈ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (ఏఎంఈ సీఈఈ)2024' నోటిఫికేషన్ వెలువడింది. ఇది జాతీయ స్థాయి పరీక్ష. ఇందులో అర్హత పొందిన అభ్యర్థులకు లైసెన్స్ ప్రోగ్రామ్‌లు, నాలుగేళ్ల ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లు, మూడేళ్ల గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లు, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లకు వరసగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ), ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ), యూజీసీ, స్కిల్ ఇండియా గుర్తింపులు ఉన్నాయి. అడ్మిషన్ పొందిన అభ్యర్థులందరికీ నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్‌లు అందిస్తారు.

ప్రోగ్రామ్‌ల వివరాలు

- **లైసెన్స్ ప్రోగ్రామ్‌లు:** ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్(డీజీసీఏ/ఈఏఎస్ఏ), కమర్షియల్ పైలెట్ లైసెన్స్
- **ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లు:** ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్, ఏరోనాటికల్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్
- **గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లు:** బీబీఏ(ఏవియేషన్), బీఎస్సీ(ఏఎంఈ)
- **సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు:** క్యాబిన్ క్రూ, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్ స్టాఫ్

అర్హత: లైసెన్స్ ప్రోగ్రామ్‌లు, ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లకు గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

- గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లలో బీబీఏ(ఏవియేషన్)కు ఆర్ట్స్/కామర్స్/సైన్స్ గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఏఎంఈ) ప్రోగ్రామ్‌నకు సైన్స్ గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి పూర్తిచేసి ఉండాలి.
- సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లకు ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణత చాలు.
- ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు అడ్మిషన్ నాటికి 16 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.

ఏఎంఈ సీఈఈ 2024 వివరాలు: దీనిని ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. పరీక్ష సమయం గంట. ఇంటర్/తత్సమాన అర్హత ఉన్న అభ్యర్థులకు మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు ఇస్తారు. డిప్లొమా పూర్తిచేసినవారికి జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లీష్, ఆప్టిట్యూడ్ నుంచి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు నాలుగు మార్కులు చొప్పున మొత్తం మార్కులు 300. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ప్రశ్నపత్రాన్ని ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో ఇస్తారు. ఎగ్జామ్ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

స్కాలర్‌షిప్ వివరాలు: ఏఎంఈ సీఈఈ 2024 ఎగ్జామ్‌లో మొదటి మూడు ర్యాంక్‌లు సాధించిన వారికి, సెంట్రల్/స్టేట్ బోర్డు ఎగ్జామ్ (ఇంటర్ స్థాయి పరీక్ష)లో టాపర్స్‌గా నిలిచిన పదిమందికి స్కాలర్‌షిప్ కింద మొదటి సెమిస్టర్ ట్యూషన్ ఫీజు చెల్లిస్తారు. ఏఎంఈ సీఈఈ 2024 ఎగ్జామ్‌లో 4 నుంచి 15 ర్యాంక్‌ల మధ్య సాధించిన 12 మందికి 75 శాతం; 16 నుంచి 50 మధ్య ర్యాంక్‌లు సాధించిన 35 మందికి 50 శాతం; 51 నుంచి 200 మధ్య ర్యాంక్‌లు సాధించిన 150 మందికి 25 శాతం; 201 నుంచి 1,000 మధ్య ర్యాంక్‌లు సాధించిన 800 మందికి 20 శాతం; 1001 నుంచి 5,000 మధ్య ర్యాంక్‌లు సాధించిన 4,000 మందికి 15 శాతం; ఏఎంఈ సీఈఈ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులందరికీ 10 శాతం చొప్పున మొదటి సెమిస్టర్ ట్యూషన్ ఫీజు చెల్లిస్తారు.

ఉద్యోగావకాశాలు: ఏఎంఈ ప్రోగ్రామ్‌లు పూర్తి చేసిన అభ్యర్థులు ఏరోనాటికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఎయిర్‌పోర్ట్ అండ్ ఎయిర్‌లైన్ మేనేజ్‌మెంట్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, క్యాబిన్ క్రూ, ఏవియేషన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఏవియేషన్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ విభాగాల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చు. ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీర్లు, ఏవియేషన్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ డిస్పాచర్, ఏవియేషన్ సెక్యూరిటీగా పనిచేయవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** www.amecee.in

దిక్సూచి DIKSUCHI

ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీలో

పీజీ, పీహెచ్‌డీ

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ(ఏపీఎఫ్‌యూ) - 2023-24 అకడమిక్ ఇయర్‌కు సంబంధించి మాస్టర్ ఆఫ్ ఫిషరీ సైన్స్(ఎంఎఫ్ఎస్సీ), పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. నెల్లూరు జిల్లా ముత్తుకూరులోని కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్సెస్‌లో అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్ల వివరాలు: ఎంఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లో ఆక్వాకల్చర్ 3, ఆక్వాటిక్ యానిమల్ హెల్త్ మేనేజ్‌మెంట్ 2, ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ 4, ఆక్వాటిక్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ 2, ఫిష్ ప్రాసెసింగ్ టెక్నాలజీ 3, ఫిషరీస్ ఇంజనీరింగ్ 2 సీట్లు చొప్పున మొత్తం 16 సీట్లు ఉన్నాయి. పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ఆక్వాకల్చర్ 2 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఎంఎఫ్ఎస్సీలో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి నాలుగేళ్ల బీఎఫ్ఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. దరఖాస్తు నాటికి అభ్యర్థుల వయసు 40 ఏళ్లు మించకూడదు. పీహెచ్‌డీలో ప్రవేశానికి ఎంఎఫ్ఎస్సీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 50 ఏళ్లు మించకూడదు. రెండు ప్రోగ్రామ్‌లకు జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 20
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ, అయిదో అంతస్తు, విశాల్ రెసిడెన్సీ, పద్మజ నగర్, తాడిగడప, విజయవాడ-521134
- **వెబ్‌సైట్:** www.apfu.ap.gov.in

బుక్ మై షోకు ఫిర్యాదు చేశాం



నాగవంశీ

'కొంతమంది కావాలనే బుక్ మైషోలో నకిలీ రివ్యూలు ఇచ్చి, 'గుంటూరు కారం' సినిమాను దెబ్బతీయాలని చూశారు. దానిపై ఆ సంస్థకు ఫిర్యాదు చేశాం. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'గుంటూరు కారం' విజయాన్ని అడ్డుకోవాలని కొందరు మొదటి రోజు నుంచే 'సినిమా బాగోలేద'ని సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేశారు. కానీ వారి ప్రయత్నాలు ఫలించలేదని చెప్పడానికి మా సినిమాకు వస్తున్న వసూళ్లే నిదర్శనం. ఆ విషయం చెప్పడానికే మీడియా ముందుకొచ్చాను' అని నిర్మాత నాగవంశీ అన్నారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. తొలి వారాంతానికే రూ. 200 కోట్ల వసూళ్లను సాధించి బాక్సాఫీసు దగ్గర నిలకడగా కొనసాగుతోందని. నాగవంశీ మీడియాతో ఆనందం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

- మహేశ్‌బాబు మొదట్నుంచి ఈ సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నారు. నెగెటివ్ రివ్యూలు వచ్చినా ఆయన ఆందోళన చెందలేదు. 'రేపటి నుంచి 'గుంటూరు కారం' వసూళ్లు ఎలా ఉంటాయో చూడండి' అన్నారు. ఆయన అంచనాలే నిజమయ్యాయి. మహేశ్ ధైర్యమే ఈ స్థాయి వసూళ్లకు కారణమైందనుకుంటున్నాను.
- 'గుంటూరుకారం' సినిమా కొంత మంది మీడియా వాళ్లకు లక్ష్యంగా మారింది. డిస్ట్రిబ్యూటర్లకు, థియేటర్లకు ఫోన్ చేసి మరీ వసూళ్ల గురించి ఆరా తీస్తున్నారు. వాళ్లు ఎన్ని విధాలా ప్రయత్నించినా, నెగెటివ్ రివ్యూలు ఇచ్చినా సినిమా ఫలితాన్ని దెబ్బతీయలేకపోయారు. రిలీజైన తొలి రోజే సోషల్ మీడియా ద్వారా సినిమా బాగోలేదనే ప్రచారాన్ని మొదలుపెట్టారు. కానీ సినిమా బాగుండడంతో ప్రేక్షకులు వాటన్నింటినీ పక్కనపెట్టి అఖండ విజయాన్ని అందించారు. కుటుంబ ప్రేక్షకులకు మా సినిమా బాగా నచ్చడం వల్లే ఈ స్థాయి వసూళ్లు వస్తున్నాయి. గతంలో మా బేనర్‌లో వచ్చిన చిత్రాలకు నెగెటివ్ రివ్యూ వచ్చినప్పుడు వసూళ్లు పడిపోయాయి. కానీ ఈ సారి మాత్రం వాటితో సంబంధం లేకుండా 'గుంటూరు కారం' భారీ వసూళ్ల దిశగా సాగుతోంది. కొందరు కావాలనే మా సినిమాను టార్గెట్ చేశారనే అభిప్రాయం ఉంది.
- దీనిని ఫ్యామిలీ సినిమాగా ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లి ఉండాల్సింది. ఇది త్రివిక్రమ్ శైలిలో ఉండే ఫ్యామిలీ సినిమా అని ప్రేక్షకులకు ముందే తెలియజెప్పలేకపోయాం. దీనివల్ల 'గుంటూరు కారం' పక్కా మాస్ ఫిల్మ్ అని అభిమానులు అనుకున్నారు. అందువల్ల మొదట్లో కొంత నిరాశ చెందినా సర్దుకున్నారు.



బాధపెట్టాం... క్షమించండి

నయనతార

నయనతార 'అన్నపూరణి' వివాదం ఇంకా సద్దుమణగలేదు. కథ రీత్యా ఇందులోని కొన్ని సన్నివేశాలు మత విశ్వాసాలను భంగపరిచేలా వున్నాయంటూ పలువురు అభ్యంతరాలు వెలిబుచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయంపై నయన్‌తో సహా చిత్ర బృందంపై మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్, ముంబయ్‌ల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి . దీంతో చిత్ర నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ ఈ సినిమాను ఓటీటీ స్ట్రీమింగ్ నుంచి తొలగించడంతోపాటు వివరణ కూడా ఇచ్చుకుంది. ఇదిలావుంటే.. రీసెంట్‌గా 'అన్నపూరణి' వ్యవహారంపై నయనతార భావోద్వేగపూరితంగా సోషల్ మీడియా ద్వారా ఓ లేఖను విడుదల చేశారు. 'బరువెక్కిన హృదయంతో ఈ లెటర్‌ను రాస్తున్నాను. నిజానికి 'అన్నపూరణి' మంచి ప్రయత్నం. ఓ మంచి ఆలోచన ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉద్దేశ్యంతో ఈ సినిమా చేశాం. సంకల్పం గట్టిదైతే ఏదైనా సాధించవచ్చు అనే మంచి విషయాన్ని ఈ సినిమా ద్వారా చర్చించాం. కానీ ఈ ప్రయత్నంలో తెలీకుండానే కొందరి మనసుల్ని బాధపెట్టాం. ఇది ఉద్దేశ్యపూర్వకంగా జరిగింది కాదు. మనోభావాలు దెబ్బతీయడం మా అభిమతం కాదు. నా 20 ఏళ్ల కెరీర్‌లో ఎవరినీ బాధపెట్టలేదు. సానుకూలంగానే ముందుకెళ్లాను. సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చిన సినిమాను ఓటీటీ నుంచి తొలిగిస్తారని అనుకోలేదు. తెలిసో తెలియకో కొందరిని బాధపెట్టాం. క్షమించమని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నాం' అంటూ సోషల్ మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు నయనతార. ఇక 'అన్నపూరణి' కథ విషయానికొస్తే.. 'అగ్నిహోత్రం లాంటి సంప్రదాయ కుటుంబంలో పుట్టిన ఓ అమ్మాయి, చెఫ్ కావాలనే తన కోరికను ఎలా సాకారం చేసుకుంది? అనే ప్రశ్నకు సమాధానంగా ఈ సినిమా రూపొందింది. నయనతార టైటిల్‌రోల్ పోషించిన ఈ చిత్రంలో సత్యరాజ్, జై కీలక పాత్రలు పోషించారు. నీలేశ్ కృష్ణ దర్శకుడు.

ఫిల్మ్ ఛాంబర్ మాట నిలబెట్టుకోవాలి

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ

సంక్రాంతి సినిమా వార్ ముగిసింది అనుకునేలోపే రాబోతున్న ఫిబ్రవరి వార్‌కి సంబంధించిన సెగలు అప్పుడే మొదలయ్యాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు ఫిల్మ్‌ఛాంబర్‌కి రాసిన లేఖ.. వార్ మొదలవ్వకముందే వాతావరణం వేడెక్కేలా చేసిందని చెప్పాలి. నిజానికి పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన రవితేజ 'ఈగల్' సినిమా సంక్రాంతికి విడుదలకావాల్సింది. కానీ అప్పటికే నాలుగు సినిమాలు పోటీలో ఉండటం, తద్వారా తలెత్తే థియేటర్ల కొరత.. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని 'ఈగల్'ని ఫిబ్రవరికి వాయిదా వేసుకోవలసిందిగా ఛాంబర్ కోరింది. ఫిబ్రవరిలో సోలో డేట్ వచ్చేలా చూస్తామని ఫిల్మ్‌ఛాంబర్ మాటివ్వడంతో.. పీపుల్‌మీడియా సంస్థ 'ఈగల్'ని ఫిబ్రవరి 9కి వాయిదా వేసింది. ఇదిలావుంటే.. ఇప్పుడు అదే తేదీకి రజనీకాంత్ 'లాల్ సలామ్', సందీప్‌కిషన్ 'ఊరి పేరు భైరవకోన' చిత్రాలు విడుదల కానున్నాయి. ఈ విషయాన్ని సదరు చిత్రాల నిర్మాతలు ప్రకటించారు కూడా. ఈ నేపథ్యంలో 'సోలో డేట్ ఇస్తాం' అని మాటిచ్చిన ఛాంబర్, తన మాటను నిలబెట్టుకోవాలని, తమకు సోలో డేట్ వచ్చేలా సహకరించాలని కోరుతూ ఫిల్మ్‌ఛాంబర్‌కి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ లేఖ రాసింది. మరి ఈ విషయంపై ఛాంబర్ ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి. ఇక 'ఈగల్' విషయానికొస్తే రవితేజ కథానాయకుడిగా రూపొందిన ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. అనుపమా పరమేశ్వరన్, కావ్య థాపర్ కథానాయికలు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/TbmSwCB లో చదవండి.

జాబ్ కార్నర్

డా.వైఎస్ఆర్ హెల్త్ వర్సిటీలో జూనియర్ అసిస్టెంట్స్

విజయవాడలోని డాక్టర్ వైఎస్ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 20

అర్హత: బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి

ఎంపిక ప్రక్రియ: ప్రిలిమినరీ ఎగ్జామ్, మెయిన్ ఎగ్జామ్, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



దరఖాస్తు రుసుము: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికులు, దివ్యాంగులకు రూ.750. ఇతరులకు రూ.1500.

ఫీజు చెల్లింపునకు చివరి తేదీ: జనవరి 31

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 1

వెబ్‌సైట్: drysruhs.edu.in/

ఏపీ జ్యుడీషియల్ సర్వీస్‌లో జడ్జి పోస్టులు

ఏపీ స్టేట్ జ్యుడీషియల్ సర్వీస్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్/ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అమరావతిలోని ఏపీ స్టేట్ హైకోర్ట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

పోస్టు: సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్)

ఖాళీలు: 39(32 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్; 7 ట్రాన్స్‌ఫర్ ద్వారా భర్తీ చేస్తారు)

అర్హత: లా లో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: జనవరి 31 **చివరి తేదీ:** మార్చి 1

వెబ్‌సైట్: https://aphc.gov.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/HQ81KRrలో చదవండి.

ఎన్‌పీటీఐలో పీజీ డిప్లొమా

హరియాణాలోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా 2024 వింటర్ సెషన్ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్ అనే స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా పలు మాడ్యూల్స్, ఇండస్ట్రియల్/ఫీల్డ్ ట్రెయినింగ్, ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ చివర్లో ఫైనల్ ఎగ్జామ్ నిర్వహిస్తారు. మొత్తం 360 సీట్లు ఉన్నాయి. వీటిలో 25 శాతం సీట్లను పవర్ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు ప్రత్యేకించారు.

పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: ఈ స్పెషలైజేషన్‌లో గ్యాస్, సోలార్, విండ్, బయోమాస్ తదితర పవర్ ప్లాంట్‌లకు సంబంధించిన ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ అంశాలు వివరిస్తారు. పవర్ సెక్టార్ విభాగాల నిర్వహణకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఫరీదాబాద్, నాగ్‌పూర్, నైవేలీ, శివపురి క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 చొప్పున మొత్తం 240 సీట్లు ఉన్నాయి.

రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్: ఈ స్పెషలైజేషన్‌లో రెన్యూవబుల్ ఎనర్జీ సోర్సెస్‌కు సంబంధించిన టెక్నాలజీ, ఎకనామిక్స్, పాలసీ, ఎనర్జీ సిస్టమ్స్, సప్లయ్ తదితర అంశాలు ఉంటాయి. సోలార్ ఎనర్జీ సిస్టమ్స్, ఫొటోవోల్టాయిక్ సిస్టమ్స్, థర్మల్ ఎనర్జీ సిస్టమ్స్, విండ్ ఎనర్జీ, బయోమాస్, జియోథర్మల్, టైడల్ అండ్ వేవ్ ఎనర్జీ, హైడ్రోజన్ అండ్ ఫ్యూయెల్ సెల్స్ గ్రిడ్ ఇంటిగ్రేషన్, ఇంటర్ఫేసింగ్ టెక్నాలజీస్ అంశాలు వివరిస్తారు. న్యూఢిల్లీ, బెంగళూరు క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో(బీఈ/బీటెక్/తత్సమాన కోర్సు)(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/సీ అండ్ ఐ/పవర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు రెండు స్పెషలైజేషన్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్ స్పెషలైజేషన్‌కు(బీఈ/ బీటెక్)(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఐటీ) అభ్యర్థులు కూడా అర్హులే. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **కోర్సు ఫీజు:** నాన్ స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.2,30,000; స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.3,60,000. అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 22
- **వెబ్‌సైట్:** npti.gov.in

అదీ నా అదృష్టం



వీకే నరేశ్

నటుడిగా 50 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను అని వీకే నరేశ్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటిస్తూ. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్లే నటుడిగా సుదీర్ఘ కెరీర్ సాధ్యమైందని చెప్పారు. జీవితాంతం పరిశ్రమకు సేవ చేస్తానని పేర్కొన్నారు. ఊహ తెలిసినప్పటి నుంచి సినిమాల మధ్యనే పెరగడం వల్ల ఇదే తన జీవితం కావాలని కోరుకున్నానని చెప్పారు. తొమ్మిదో ఏట 'పండంటి కాపురం' లాంటి చిత్రంతో బాలనటుడిగా అరంగేట్రం చేయడం, ఎన్టీఆర్ లాంటి గొప్ప నటులతో కలసి పనిచేయడం తన జీవితంలో మర్చిపోలేని అనుభవం అని తెలిపారు. ఒక్క సినిమాలో హీరోగా నటించినా చాలు అనుకున్న తనకు ప్రేక్షకులు ఇంత సుదీర్ఘ సినీ కెరీర్‌ను ఇచ్చారని, వారికి రుణపడి ఉంటానని అన్నారు. నంది పురస్కారాలను అందించకపోవడంపై నరేశ్ స్పందిస్తూ 'నంది పురస్కారాలను చిత్ర పరిశ్రమలో చాలా గౌరవంగా, ఒక గుర్తింపుగా భావిస్తారు. కానీ ఇప్పుడు ఆ పురస్కారాలను ప్రభుత్వాలు అందజేయకపోవడం చాలా బాధాకరం. దీనివల్ల ఒక తరం నటీనటులకు అసలు నంది పురస్కారాలు అంటే తెలిసే అవకాశం కూడా లేకుండా పోతుంది. నంది పురస్కారాలు ఇచ్చే సంప్రదాయాన్ని ప్రభుత్వాలు మళ్లీ పునరుద్ధరించాలి' అని కోరారు. 'సేవాభావంతోనే నేను రాజకీయాల్లోకి వెళ్లాను, కానీ అక్కడ మారిన పరిస్థితుల్లో ఇమడలేక బయటకు వచ్చాను, మళ్లీ ఆ వైపు వెళ్లే ఆలోచన ప్రస్తుతానికైతే లేదు' అని నరేశ్ తెలిపారు. రాజమౌళి, మహేశ్‌బాబు కాంబినేషన్‌లో రూపొందే సినిమా తెలుగు పరిశ్రమ ఖ్యాతిని మరో స్థాయికి తీసుకెళుతుందని చెప్పారు. నటుడిగా తనని తాను కొత్త కోణంలో ఆవిష్కరించుకొనే పాత్రలు మరిన్ని వస్తున్నాయనీ, నెగెటివ్ రోల్స్ చేయాలనుందని ఆయన చెప్పారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



కలెక్టరేట్‌లో వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

వేమన సాహిత్యంతో వ్యక్తిత్వ వికాసం

● కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట కల్చరల్, జనవరి, 19. వేమన సాహిత్యం వ్యక్తిత్వ వికాసానికి, సమాజ అవగాహనకు దోహదం చేస్తుందని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని అంబేద్కర్ హాల్‌లో వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ కొండవీటి రాజులకాలంలో వేమారెడ్డిగా ఉన్న ఆయన అనంతరం యోగి వేమనగా స్వీయ అనుభవాలను పద్యరూపంలో మలచి వాటి ద్వారా సమాజ చైతన్యానికి కృషి చేశారని పేర్కొన్నారు. తొలుత వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తమ సిబ్బంది చేత కొన్ని వేమన పద్యాలను పలికించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● వేమన జయంతిని గురువారం రాత్రి పట్టణంలోని పల్నాడు కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ శివశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన సాహిత్యం అజరామరమని పేర్కొన్నారు. మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధికార సంఘం సభ్యులు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు వేమన పద్యాల్లోని అంతరార్థాన్ని వివరించారు. కార్యక్రమాన్ని శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాగా పట్టణానికి చెందిన వేమన మహేష్ వేమన పద్యాలను ఆలపించారు. సమావేశానికి విశ్రాంత ప్రిన్సిపాల్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని శ్రీనాథ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి నిర్వహించగా, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సత్య శ్రీనివాస అయ్యంగార్, రత్నాకరం రాము, పద్యకవి వెంకటరెడ్డి, బి.శివకుమారి, పల్నాడు కళాక్షేత్రం అధ్యక్షుడు పి.ఈశ్వరరెడ్డి, రంగస్థలి అధ్యక్షుడు బాజిమస్తాన్, ఏఏ మధుకుమార్, ఎంఎస్ బాబు, జి.చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ, జనవరి 19: నియోజకవర్గ యోగి వేమారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో యోగి వేమన జయంతిని పట్టణంలోని పల్నాడు రోడ్డులోని సేవా సమితి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన, వైఎస్సార్ చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. సేవా సమితి అధ్యక్షుడు అరె శివారెడ్డి మాట్లాడుతూ యోగివేమన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. వేమన పేరును ఏదో ఒక జిల్లాకు పెట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంధం బాలిరెడ్డి, ములకా రామతులసిరెడ్డి, ఎరుకలరెడ్డి, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్‌మోహన్‌రెడ్డి

● టీడీపీ ఎస్సీ సెల్ నేతలు



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న ఎస్సీ సెల్ నాయకులు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 19: దళిత ద్రోహి జగన్‌రెడ్డి అంటూ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం దళితులపై దాడులకు తెగబడుతూ విగ్రహ రాజకీయాలకు తెరలేపారన్నారు. రాష్ట్రంలో దళితులు ఎవ్వరూ జగన్‌రెడ్డిని నమ్మరన్నారు. జగన్ చేతగాని పాలనలో రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దమనకాండను ఖండిస్తున్నామన్నారు. రిమాండ్‌లో మగ్గుతున్న దళిత యువకుడు కోడికత్తి శ్రీనుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు కె.వీరయ్య, ఎం.రవి, శానం శ్రీనివాసరావు, గొట్టిపాటి బాబు, కొండయ్య, కొండపాటి రమేష్, పిల్లి కోటి, యాకోబు, చిన్న, దార్ల సుబ్బారావు, శివ, రాయి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

30న నరసరావుపేటలో తపాలశాఖ లేఖ రచన పోటీలు

నరసరావుపేట టౌన్, జనవరి 19: నరసరావుపేటలో డబ్ల్యూసీటీసీ తపాలశాఖ ఉదయం 11గంటలకు లేఖ రచన పోటీలు నిర్వహిస్తోందని పోస్టల్ సూపరింటెండెంట్ పీ వెంకటస్వామి శుక్రవారం తెలిపారు. యట్150 ఇయర్స్ ఓల్డ్, దీ యపీయు హాజ్ సర్వడ్ పీపుల్ అరౌండ్ ది వరల్డ్ ఫర్ మోర్ దేన్ ఎయిట్ జనరేషన్స్, దీ వరల్డ్ హాజ్ చేంజ్ ఇనార్మస్‌లీ సిన్స్ దేన్ అనే అంశంపై 800 పదాలు మించకుండా తెలుగు, ఆంగ్లం, హిందీలలో, లేదా గుర్తించబడిన ఏదైనా భాషలలో లేఖ రాయవచ్చునన్నారు. పోటీలకు 9 నుంచి 15 సంవత్సరాల లోపు విద్యార్థులు హాజరుకావచ్చునన్నారు. పోటీలలో పాల్గొనదలిసిన విద్యార్థులు పుట్టిన తేదీ ఆధారం, లేదా ఆధార్‌కార్డు, పాఠశాల మంజూరు చేసిన ధ్రువపత్రం, మూడు పాస్‌పోర్టు ఫొటోలు తెచ్చుకోవాలన్నారు. విజేతలకు రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ రూ.25వేలు, రూ.10వేలు, రూ.5వేలు, జాతీయస్థాయిలో రూ.50 వేలు, రూ.25 వేలు, రూ.10 వేలు వరుస బహుమతులతో పాటు సర్టిఫికెట్ అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అదనపు సమాచారం కోసం 08647-222244 నంబరును సంప్రదించాలన్నారు.



చిన్నగురునాథంను సన్మానిస్తున్న వినుకొండ ఆర్యవైశ్య సంఘం నాయకులు

జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడికి సన్మానం

వినుకొండ, జనవరి 19: పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నియమితులైన గుడివాడ చిన్నగురునాథంను వినుకొండ ఆర్యవైశ్య సంఘం నాయకులు శుక్రవారం దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. వినుకొండ పట్టణానికి చెందిన చిన్న గురునాథంకు తొలిసారిగా జిల్లా స్థాయి పదవి వరించడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా వారు తెలిపారు. అందరిని కలుపుకొని ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, పేదలకు అండగా ఉంటానని గురునాథం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ రాజేష్‌ఖన్నా, పులిపాటి రామారావు, చుండూరి శ్రీమన్నారాయణ, రెడ్డి బంగారయ్య కె.బాలసుబ్రహ్మణ్యం, జి.హనుమంతరావు, జి.శ్రీనివాసరావు, కె.శివ, ఎ.సుబ్బారావు, రెడ్డి నాగపద్మ, నగేష్, రెడ్డి వెంకటరత్నం, గ్రంధిశిల శివ, మల్లికార్జున, గుండా సురేష్‌బాబు, పెండేల శ్రీకాంత్‌లతో పాటు పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

మృతిచెందిన యువకుడు జాన్సన్‌బాబుగా గుర్తింపు

వినుకొండ టౌన్, జనవరి 19: ఏనుగుపాలెం రైల్వే గేటు సమీపంలో ప్రమాదవశాత్తూ ట్రైన్‌దిగుతూ కిందపడి మృతిచెందిన వ్యక్తిని ఎట్టకేలకు బంధువులు శుక్రవారం గుర్తించారు. పేరేచర్లకు చెందిన కందుల జాన్సన్‌బాబు (20) బాపట్ల జిల్లా మేకపాడులో జరిగే ఓ కార్యక్రమానికి వెళ్లేందుకు పేరేచర్ల నుంచి వినుకొండకు రైలులో ప్రయాణించాడు. ప్రమాదవశాత్తు రైలు దిగుతూ కిందపడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని చూసిన బంధువులు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలోని మృతదేహాన్ని గుర్తించారు. మృతునికి భార్య సిరివల్లితో ఐదు నెలల క్రితం వివాహమైనట్లు బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ముగిసిన ఆడుదాం-ఆంధ్ర మండలస్థాయి పోటీలు

శావల్యాపురం, జనవరి 19: మండలంలోని 11 గ్రామసచివాలయాల పరిధిలో నిర్వహించిన ఆడుదాం-ఆంధ్ర మండలస్థాయి పోటీలు శుక్రవారంతో ముగిసినట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పురుషుల విభాగంలో క్రికెట్‌లో వేల్పూరు-1, వాలీబాల్‌లో శావల్యాపురం, ఖోఖోలో వేల్పూరు-1, కబడ్డీలో వేల్పూరు-2, బ్యాడ్మింటన్‌లో మతుకుమల్లి జట్లు తుదిపోరులో విజయం సాధించి ప్రథమస్థానంలో నిలిచాయని తెలిపారు. మహిళల విభాగంలో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లలో శావల్యాపురం జట్టు, బ్యాడ్మింటన్, ఖోఖోలలో మతుకుమల్లి జట్టు తుదిపోరులో విజయం సాధించి ప్రథమస్థానంలో నిలిచాయని తెలిపారు. గెలుపొందిన జట్లు ఈ నెల 24 నుంచి వినుకొండలో జరగనున్న ఆడుదాం-ఆంధ్ర నియోజకవర్గస్థాయి పోటీలలో పాల్గొంటాయని, పోటీలలో పాల్గొనే జట్ల సభ్యులకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తామని తెలిపారు. విజేతలను ఎంఈవోలు సాంబశివరావు, లలితాకుమారి, వైద్యాధికారి రాధాకృష్ణన్, పీడీలు రాధాకృష్ణమూర్తి, రాజేష్, మణి, సుజాత, పంచాయతీ కార్యదర్శులు చింతా శ్రీనివాసరావు, మనోహర్, ఆశోక్‌చౌదరి, మహేందర్, రవీంద్ర, సూరిలు అభినందించారు.

వైసీపీని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 19: రాబోయే ఎన్నికల్లో జగన్‌రెడ్డి అరాచక పాలనకు ప్రజలు బుద్ధిచెప్పి వైసీపీని రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదకంచర్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ ఆధ్వర్యంలో ఇంటింటికి పర్యటించి వైసీపీ అక్రమాలను వివరించి మేనిఫెస్టో పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. అనంతరం జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో స్కీమ్‌ల పేరుతో భారీ స్కామ్‌లు చేసి ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. నిత్యావసర ధరలు పెరిగి సామాన్యుడి జీవనం కష్టతరంగా మారిందన్నారు. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా నిధులు తీసుకురావడం చేతకాని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అభివృద్ధి చేశానంటూ బీరాలు పలకడం సిగ్గుచేటన్నారు. వినుకొండ నియోజకవర్గంలో సీసీ రోడ్లు, పొలాలకు లింక్ రోడ్లు, అంతర్గత రహదారులు, శ్మశాన వాటికల అభివృద్ధి, తారు రోడ్ల నిర్మాణాలు టీడీపీ హయాంలోనే జరిగాయని అన్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని పొలిటికల్ రియల్‌ఎస్టేట్ చేసి ప్రభుత్వ భూములను మింగేసి వందల కోట్లు దోచుకొని నియోజకవర్గ ప్రజలను మోసంచేసిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్తారన్నారు.

వైసీపీ నుంచి 25 కుటుంబాలు టీడీపీలో చేరిక...

మండలంలోని పెదకంచర్ల గ్రామం అధికార వైసీపీకి చెందిన 25కుటుంబాల వారు పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో గణపర్తి నాగేశ్వరరావు, లింగా శ్రీనివాసరావు, రామనేని పూర్ణ, నాగులపాటి వెంకట్రావు, చిరుమామిళ్ల రాంబాబు, ఎస్.బ్రహ్మం, నాగులపాటి వెంకట్రావు, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, సోమేపల్లి ఆంజనేయులు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి జీవీ ఆంజనేయులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదినేని ఆంజనేయులు, టీడీపీ నాయకులు మక్కెన కొండలు, పీవీ సురేష్‌బాబు, మద్దుకూరి రాంబ్రహ్మం, బోడెపూడి గోవిందరాజులు, ముత్తినేని ఏడుకొండలు, కర్నాటి వెంకటరెడ్డి, ఆకుమళ్ల ఖాశీం, మాదాల చిరంజీవి, మాదాల కృష్ణ, మక్కెన రమేష్, మేడా వెంకట అశోక్, యర్రంరెడ్డి అంజిరెడ్డి, వజ్రాల కృష్ణారెడ్డి, భవనం పేరిరెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షుడు కొండలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తజెడ్డావారిపాలెంలో 70 కుటుంబాలు టీడీపీలో చేరిక

నూజెండ్ల, జనవరి 19: వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని, బొల్లా బ్రహ్మనాయుడు వినుకొండ నియోజకవర్గాన్ని రావణకాష్టంలా మార్చారని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని కొత్తజెడ్డావారిపాలెంకు చెందిన 70కుటుంబాలు డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ చైర్మన్ డాక్టర్ పారా వెంకట లక్ష్మయ్య ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి జీవీ ఆంజనేయులు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జీవీ మాట్లాడుతూ ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయటం మరచి కక్షలు, కక్షపూరిత పాలన చేస్తున్నారన్నారు. డాక్టర్ పారా వెంకట లక్ష్మయ్య సేవలు తెలుగుదేశం పార్టీకి ఎంతో అవసరమన్నారు. అదే విధంగా డాక్టర్ పారా వెంకట లక్ష్మయ్య మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు అనేక కుటుంబాలు నష్టపోయాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మానుకొండ శివప్రసాదు, శావల్యాపురం జడ్పీటీసీ పారా హైమావతి, మండల పార్టీ అధ్యక్షుడు మీసాల మురళీకృష్ణ యాదవ్, లగడపాటి వెంకటరావు, టీడీపీ నాయకులు వంకాయలపాటి పేరయ్య, పారా, దిరిశాల, గోగులపాటి, అర్దవీటి, తూమాటి, జంపాల కుటుంబాల పెద్దలు పాల్గొన్నారు.



కొత్తజెడ్డావారిపాలెంలో టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

నల్లిదోమ తాకిడితో మిర్చి రైతుల విలవిల

● నియోజకవర్గంలో 9వేల హెక్టార్లకు పైగా మిర్చి సాగు
● దోమ నివారణ అవ్వక తలలు పట్టుకుంటున్న రైతన్నలు

వినుకొండ టౌన్, జనవరి 19: ఆరుగాలం శ్రమించి పండించిన పంట కళ్ల ముందు తెగుళ్లు సోకి పంట చేతికొచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో రైతులు విలవిలాడిపోతున్నారు. మార్కెట్‌లో మిర్చికి ఆశించిన మేరకు ధర పలకడంతో రైతులు ఎక్కువశాతం మిర్చి పంటను పండించేందుకు ఆసక్తి చూపారు. మిర్చిపంటకు నల్లిదోమ తొలి పంటకే చెట్లు ఎండుముఖం పట్టడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి పండించిన పంట కళ్లముందు దోమ తాకిడికి ఎండుముఖం పట్టడంతో రైతులు నిరుత్సానికి గురవుతున్నారు. కొందరు మిర్చి పంటను అర్థాంతరంగా దున్ని పొగాకు సాగు చేస్తున్నారు. మండలంలోని ఉప్పరపాలెం గ్రామానికి చెందిన చిలకల మోజేష్ కుటుంబంలోని తన తమ్ముళ్లైన కిరణ్, రమేష్, ఏసోబులు ఎకరం చొప్పున మిర్చి పంటను పండిస్తున్నారు. పంటను నాటిన మూడు నెలలకే తొలి కాపు కాయకముందే పంటకు నల్లిదోమ సోకి చెట్లు ఎండిపోయాయి. కనీసం కోత కూలీ కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో మోషే కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేక అప్పుల పాలయ్యామంటూ ఆశీర్వాదమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

పంటలను పరిశీలించని అధికారులు...

దోమ తాకిడికి ఉప్పరపాలెం గ్రామంలో 90శాతం మేరకు బ్యాడిగి, తేజ వంటి రకాల మిర్చి తోటలు పూర్తిగా ఎండిపోయాయని, ఈ సంవత్సరం రైతులు కోలుకునే పరిస్థితి లేదని, కనీసం అధికారులు వచ్చి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేసిన దాఖలాలు లేవని గ్రామానికి చెందిన రైతు శివారెడ్డి వాపోయాడు.



ఉప్పరపాలెంలో నల్లిదోమ తాకిడికి ఎండిపోయిన మిర్చి పంట

కంపెనీ మందులను పిచికారి చేయాలి...

నియోజకవర్గంలో మొత్తం 9వేల హెక్టార్లకు పైగా మిరప పంటను పండించగా ఇప్పటికి 15 నుంచి 20 శాతంకు పైగా నల్లిదోమ తాకిడికి పంటలు దెబ్బతిన్నట్లు హార్టికల్చర్ అధికారి నబీరసూల్ తెలిపారు. నల్లిదోమ కారణంగా గ్రామాల్లో రైతులు సీల్ చేయని నీళ్ల మందులను పిచికారి చేయరాదని, అధికారులు సూచించిన కంపెనీ నీళ్ల మందులనే పంటలపై పిచికారి చేయాలని సూచించారు. ఎవరైనా రైతులను మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

అక్రమ మద్యం కేసులో నిందితులకు రిమాండ్

నరసరావుపేట లీగల్, జనవరి 19: అక్రమంగా మద్యం కలిగి ఉన్న కేసులో నిందితులకు రిమాండ్ విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రవలిక శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పట్టణంలోని వరవకట్టకు చెందిన షేక్ సుభానీ, శ్రీనివాస గిరిజన కాలనీకి చెందిన దేవర భవానీప్రసాదు, కొండలరావుపేటకు చెందిన జాగం సంతోష్ కుమార్‌లు గురువారం సాయంత్రం పట్టణంలోని మొదటి రైల్వే గేటు సమీపంలో మోటారు సైకిల్‌పై 30 తెలంగాణ మద్యం సీసాలను కలిగి ఉండగా నరసరావుపేట మొదటి పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మోటారు సైకిల్‌ను, మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితులను శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించారు.

22 నుంచి ఉచిత యోగ శిక్షణ

నరసరావుపేట టౌన్, జనవరి 19: ఉచిత యోగ శిక్షణ శిబిరం ఈ నెల 22 నుంచి ప్రారంభం అవుతుందని శ్రీవేంకటేశ్వర యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకటజనార్దన్ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని పట్టాభిరామస్వామి ఆలయంలో ఉన్న వెంకటేశ్వరకళ్యాణ మండపంలో ఉదయం 5గంటల నుంచి 7గంటల వరకు 28 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. 42యోగ భంగిమలు, ప్రాణాయామం, ధ్యానం, ఆహార నియమాలు, సూర్య నమస్కారాలు బోధిస్తామన్నారు. శిక్షణకు హాజరు అయ్యేవారు తప్పక బెడ్‌షీట్ తెచ్చుకోవాలన్నారు. అదనపు సమాచారం కోసం కన్వీనర్ కూనిశెట్టి అనురాధ, 9490846333, 9491665733 నంబర్లను సంప్రదించాలన్నారు.

రేపు వేల్పూరులో కంటి వైద్యశిబిరం

వేల్పూరు (శావల్యాపురం) జనవరి 19: మండలంలోని వేల్పూరులో గోపు శ్రీరాములు, కాకాని నాగేంద్రం శ్రీనివాసరావుల జ్ఞాపకార్థం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కాకాని అంజిబాబు శుక్రవారం తెలిపారు. పెదకాకాని శంకర్ ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ వైద్య శిబిరంలో అన్ని కంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందని, ఆపరేషన్లు అవసరమైన రోగులను ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించి పెదకాకానిలోని శంకర్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్‌లు చేయడం జరుగుతుందని తెలిపారు. రోగులు ఆధార్, ఆరోగ్యశ్రీ, ఓటుకార్డు జిరాక్స్‌లు, ఫోన్‌నెంబర్లను తీసుకొని వైద్యశిబిరానికి హాజరు కావాలని, ఇతర ఆరోగ్య సమస్యలున్నవారు గతంలో పరీక్షలు చేయించుకొన్న రిపోర్టులు తీసుకొని రావాలని కోరారు. వివరాలకు సంద్రపాటి చలపతిరావు 9492081140 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

రేపు మాజీ స్పీకర్ కోడెల విగ్రహావిష్కరణ

రొంపిచర్ల, జనవరి 19: మండలంలోని అన్నవరంలో నవ్యాంధ్ర తొలి శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహావిష్కరణ నిర్వహించనున్నట్టు టీడీపీ నాయకులు శుక్రవారం తెలిపారు. జిల్లా, నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకులు, ముఖ్య అతిథులు హాజరవుతారని తెలిపారు.

రైతు భరోసా కేంద్రాల ద్వారా కందుల కొనుగోలు

నూజెండ్ల, జనవరి 19: రైతు భరోసా కేంద్రాల ద్వారా కందులు కొనుగోలు చేయనున్నట్టు వినుకొండ ఏడీఏ బీ రవిబాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని రవ్వవరంలో మండల ప్రత్యేక అధికారిగా ఏడీఏ రవిబాబు గ్రామోదయం కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించి అధికారులు, సిబ్బంది పనితీరును పరిశీలించి సూచనలు చేశారు. అదేవిధంగా కందిపంటను పరిశీలించారు. ఈ ఏడాది రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం క్వింటాకు రూ.9,307 చెల్లించి కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో సుగుణాబేగం, ఏఈవో ఏలిషా, సచివాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంకర లారీ బోల్తా: డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు

ఇనుమెళ్ల (ఈపూరు) జనవరి 19: కంకర లోడ్‌తో వెళ్తున్న లారీ బ్రిడ్జి కూలడంతో కాలువలో పడి డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలైన సంఘటన మండలంలోని ఇనుమెళ్ల గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. క్వారీ నుంచి కంకరను తరలిస్తున్న లారీ మేజర్ కాలువపై నిర్మించిన బ్రిడ్జిపైకి వెళ్ళే సరికి అది కూలిపోవడంతో కంకర లారీ కాలువలోకి బోల్తాపడింది. క్రషర్ నుంచి అధిక బరువులతో వాహనాలు తిరగడం వల్లనే బ్రిడ్జి కూలిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. బ్రిడ్జి కూలడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

గోగులపాడులో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

రొంపిచర్ల, జనవరి 19: మండలంలోని గోగులపాడులో ఆరోగ్య సురక్ష క్యాంపును శుక్రవారం నిర్వహించారు. శిబిరంలో ఆర్థోపెడిక్ వైద్యులు ధర్మానాయక్, ఎనస్తీషియా వైద్యులు మురళీధరరెడ్డి, వైద్యులు జగన్ నరసింహారెడ్డి పాల్గొన్నారు. వైద్య శిబిరాన్ని మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆయనతో పాటు తహసీల్దార్ అంకారావు ఉన్నారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కంటి పరీక్షలను కూడా నిర్వహించారు.

మహంకాళి ఆలయంలో ధర్మప్రచార వారోత్సవాలు

ఇసప్పాలెం (నరసరావుపేట రూరల్), జనవరి 19: సనాతన హిందూధర్మ పరిరక్షణకోసం మహోన్నతమైన హిందూ ధర్మాన్ని, ఆలయ సంస్కృతిని ప్రజలందరికి తెలియజేయడం కోసం ఆలయాలను కేంద్రంగా చేసుకుని దేవదాయ ధర్మదాయశాఖ నిర్వహిస్తున్న ధర్మప్రచార కార్యక్రమంలో బాగంగా ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఇసప్పాలెం మహంకాళి ఆలయంలో ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి టి. సుధాకరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు సాయంత్రం 6గంటల నుంచి 7:30 నిమిషాల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, ధర్మప్రచార ప్రవచనాలు, జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్త సాంబశివరావు, ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు.

కళలకు, కళాకారులకు పుట్టినిల్లు చిలకలూరిపేట

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



బండారుపల్లి సత్యనారాయణను సన్మానిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 19: కళలకు, కళాకారులకు, కళా పరిషత్‌లకు పుట్టినిల్లు చిలకలూరిపేట అని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. దివంగత నందమూరి తారకరామారావు వర్ధంతిని పురస్కరించుకొని గురువారం చిలకలూరిపేట కళాతోరణం 19వ వార్షికోత్సవం సందర్భంగా మేకపోతుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్తిపాటి గార్డెన్‌లో ఏర్పాటుచేసిన సంగీత పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రత్తిపాటి హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిషత్ నిర్వాహకులు నాదెండ్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, కామినేని సాయిబాబు, రఘు రామారావు, షేక్ కరిముల్లా, జమాల్ బాషా, జరీనా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణి సెంటర్‌లో చేస్తున్న అన్నదానం

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

చిలకలూరిపేట అర్బన్, జనవరి 19: పట్టణంలోని కళ్యాణి సెంటర్‌లో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ ద్వారా శుక్రవారం 618 మంది నిరుపేదలు, వలస కూలీలకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ కరీం, తోబాడు సుభానీ, షేక్ ఉమర్, షేక్ ఖాజా, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, జవ్వాజి బుచ్చిబాబు తదితరులు పాల్గొని స్వచ్ఛందంగా సేవలు అందించారు.

సోషల్ ఆడిట్‌లో రూ.16.20లక్షల అక్రమాలు గుర్తింపు

● సిబ్బందికి రూ.54వేలు జరిమానా

వినుకొండ టౌన్, జనవరి 19: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన 15వ జాతీయ ఉపాధిహామీ ప్రజావేదిక కార్యక్రమంలో మొత్తం రూ.16,20,609లు వివిధ స్థాయిలో అక్రమాలు జరిగినట్లు ఎస్‌ఆర్‌పీ బుజ్జి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావేదికలో అవినీతి జరిగినట్లు నిర్ధారించి బాధ్యుల నుంచి రికవరీకి పీడీకి నివేదిక అందజేస్తామన్నారు. రికార్డులు సక్రమంగా నమోదు చేయనందున క్షేత్రసహాయకులు, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి పెనాల్టీగా రూ.54వేలు వసూలు చేస్తామన్నారు. మిగిలిన రూ.14.55లక్షలకు చెందిన పనులపై ఏపీడీ ఎంక్వయిరీచేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించామన్నారు.

వినుకొండ ఏపీవో వెంకటేశ్వర్లు బదిలీ

జాతీయ ఉపాధి హామీ పథకం వినుకొండ ఏపీవో పులిపాటి వెంకటేశ్వర్లును నూజెండ్ల ఏపీవోగా, నూజెండ్లలో విధులు నిర్వహిస్తున్న ఏపీవో నాగేశ్వరరావును వినుకొండకు బదిలీ చేస్తున్నట్లు పీడీ జోసఫ్‌కుమార్ శుక్రవారం తెలిపారు.

పశుసంవర్థక సహాయక పరీక్షా ఫలితాల్లో వినుకొండ వాసికి 8వ ర్యాంక్



నియామక పత్రంతో నూలి శివశంకర్

వినుకొండ, జనవరి 19 : ప్రభుత్వం విడుదల చేసిన పశుసంవర్థక సహాయకుల నియామక పరీక్షా ఫలితాల్లో వినుకొండ పట్టణానికి చెందిన నూలి శివశంకర్‌కు రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంక్ సాధించాడు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రథమస్థానం నిలిచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని గురువారం అందుకున్నారు. ఈ సందర్భంగా శివశంకర్‌ను పట్టణంలోని ఉపాధ్యాయులు, వెటర్నరీ సిబ్బంది అభినందించారు.

మెగా క్రికెట్ పోటీల విజేత వీరాయపాలెం జట్టు

నూజెండ్ల, జనవరి 19: మండలంలోని కొత్తజెడ్డావారిపాలెంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి వీరాయపాలెం, రెండో బహుమతి దొండపాడు, మూడో బహుమతి కొత్తజెడ్డావారిపాలెం జట్లు కైవసం చేసుకున్నాయి. శుక్రవారం క్రీడా ప్రాంగణంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ చైర్మన్ డాక్టర్ పారా వెంకట లక్ష్మయ్య, ఇండేన్ ఓవర్‌సిస్ కన్సల్టెన్సీ వ్యవస్థాపకులు కామినేని ఆంజనేయులు, కుటుంబ సభ్యులు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో 35 జట్లు పాల్గొన్నాయి.